epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక

STV SAMAYAM

సంపుటి: 19 | సంచిక: 201 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 31 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

epaper.samayamdaily.net APTEL/2006/18267 సమయం మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

## మోటార్లకు మీటర్లు పెడితే
# పోటీ చేయం



### ఉచిత విద్యుత్ ఆపితే రాజకీయాల నుంచే తప్పుకుంటా
### లేకుంటే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
### రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు

- హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- ధాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు పోస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్

తెలంగాణలో వ్యవసాయానికి అందిస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిలిపివేసినా, లేదా పొరపాటున వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టినా తాము భవిష్యత్ ఎన్నికల్లో అస్సలు పోటీ చేయబోమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంచలన సవాల్ విసిరారు. ఒకవేళ తాము ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా కొనసాగిస్తే.. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్ (ఇష్టాగోష్టి)లో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ కేవలం తన రాజకీయ ఉనికి కోసమే రైతుల ముసుగులో సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు.

- సమయం న్యూస్, హైదరాబాద్

2



# అధికారంలోకి వస్తాం

3

### రాగానే 111జీవో ఎత్తివేస్తాం!

- తెలంగాణ రక్షణ సేనతోనే రాష్ట్ర హక్కుల రక్షణ
- ఎలాంటి గ్యారంటీ లేకుండా యువతకు రూ.2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు
- గుంపు మేస్త్రీపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపు
- మొయినాబాద్ లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

మొయినాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 111 జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ ప్రజల ఆశయాలు పూర్తి గా నెరవేరలేదని కవిత అన్నారు. తెలంగాణ హక్కులను పరిరక్షిం చడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ఏర్పాటైందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా తమ పార్టీ ముందుకు వస్తోందని పేర్కొన్నారు.



# గంటన్నరలోనే రాష్ట్ర వేడుకలు!

- ఎండల తీవ్రతతో వేళల్లో మార్పు
- ఉదయానికే ముగింపు.. వేళల్లో మార్పులు
- 8.30కే ఆరంభం.. 10 గంటలకల్లా పూర్తి
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా ఆవిర్భావ ఉత్సవాలు
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కొత్త షెడ్యూల్

2

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈసారి అధికారిక వేడుకలను ఉదయం వేళల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించింది.



# గొడ్డలి రాజకీయాలతో ప్రజాస్వామ్యం నడవదు

- వివేకా హత్య కేసులో సునీత పోరాటానికి మద్దతు
- ఆయుధాలు పట్టిన నక్సలైట్లే నెగ్గలేకపోయారు
- వీళ్లు గొడ్డళ్లతో నెగ్గుకురాగలరా?
- ఎన్‌టీఆర్ భవన్‌లో సీఎం చంద్రబాబు ఇష్టాగోష్ఠి
- రాజ్యసభ సీట్లపై ముమ్మర చర్చలు.. ఆశావహులకు చంద్రబాబు హామీ
- తెలంగాణపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బక్కని నర్సింహులుకు క్లాస్!

ఆయుధాలు పట్టిన నక్సలైట్లు కూడా గన్ ద్వారా రాజ్యాధి కారాన్ని సాధించలేకపోయారని, అలాంటిది గొడ్డళ్లతో రాజకీయాలు చేస్తూ ఎవరూ విజయవంతం కాలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లా డిన ఆయన, హత్య రాజకీయాలు చేసిన వారు రాష్ట్రాన్ని పాలించ వచ్చని, కానీ బాధితులు మాత్రం రాజకీయాల్లోకి రావొద్దనే విచిత్ర మైన సిద్ధాంతాన్ని కొందరు నమ్ముతున్నారని విమర్శించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత చేస్తున్న పోరాటంలో న్యాయం ఉందని చంద్రబాబు అన్నారు. తన తండ్రిని ఎవరు హత్య చేశారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని పేర్కొన్నారు. సునీత ఒంటరిగా సాగిస్తున్న న్యాయపోరాటం వల్లే ఆ కేసు ఇప్పటికీ సజీవంగా ఉందన్నారు. బాధితులకు అండగా నిలవడం, నేరాలకు పాల్పడిన వారిని ప్రజాక్షేత్రంలో నిలదీయడం సమాజ బాధ్యత అని అభిప్రాయపడ్డారు.

వివరాలు 5వ పేజీలో



# సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

- కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్న బాల్క

2

# ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి



4

దేశంలో నకిలీ నోట్లు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం.

# ఉగ్ర కుట్ర భగ్నం

- ఢిల్లీ, ముంబై, పంజాబ్‌లలో భారీ దాడులకు కుట్ర
- ఐఎస్ఐ, దావూద్ లింకులతో 9 మంది అరెస్ట్
- ఉన్నత విద్యావంతులే సూత్రధారులు!



4

# ఆపరేషన్ సిందూర్ 2.0కు సర్వంసిద్ధం



4

పాక్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక



# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

## జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం

## కేశవరావు కమిటీ తొలి భేటీ

**హైదరాబాద్, మే 30:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# హైడ్రా మరో భారీ అపరేషన్

## పుప్పాలగూడ పరిధిలో ముష్కిన్ చెరువుకు విముక్తి

**హైదరాబాద్, మే 30:** హైడ్రా మరో భారీ అపరేషన్ చేపట్టింది. కబ్జాకు గురైన చెరువును పరిరక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ–నార్సింగి గ్రామాల పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ముష్కిన్ చెరువు అభివృద్ధి పేరుతో చేస్తున్న కబ్జాలకు చెక్ పెట్టింది. చెరువులో.. రూ.5,500 కోట్ల విలువైన కబ్జాలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం చెరువు 52.20 ఎకరాల పరిధిలో ఉండగా.. చెరువు మధ్యలోంచి కట్ట నిర్మించి 34.21 ఎకరాలు కబ్జా చేసే ప్రయత్నం జరిగిందని హైడ్రా పేర్కొంది. సీఎస్ఆర్ నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ.. అభివృద్ధి మాటున కబ్జాకు ప్రయత్నించింది. గ్రామ రికార్డుల ప్రకారం చెరువు పరిధి 59.11 ఎకరాలు కాగా.. ఇందులో ప్రభుత్వ శిఖం 20.23 ఎకరాలు, మిగతా అంతా పట్టాభూమి. అక్కడ ఎలాంటి నిర్మాణపనులు చేపట్టరాదనే నిబంధల్ని ఉల్లంఘించిన రియల్టర్లు.. పేదల పేరుతో గుడిసెలు వేసి కొట్టేయాలని ప్రయత్నించారు. ఖాళీ చేయాలని రెండు నెలల సమయం ఇచ్చిన హైడ్రా.. హద్దులు నిర్దారించి ఫెన్సింగ్ వేస్తోంది. చెరువు మధ్యలో వేసిన కట్టను తొలగించింది.

# ఫిర్యాదుదారులకు అందుబాటులో పోలీసులు

## పనితీరు మెరుగు పర్చుకుని సాగాలి

## టెక్నికల్ సేవల కోసం డిజిపి టెక్ టీమ్ ఏర్పాటు

## పోలీస్ అధికారులతో డిజిపి ఆనంద్ సమీక్ష

**హైదరాబాద్,మే30:** ఫిర్యాదుదారుల కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీజీపీ ఆనంద్ సూచించారు. సీసీటీఎన్ఎస్ వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ల నుంచి ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన డీజీపీ, పాత పద్ధతులను విడిచిపెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని డీజీపీ తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని సూచించారు. త్వరలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో, ఫుడ్ అడల్టేషన్ వింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. జూనియర్లు సీనియర్లకు గౌరవం ఇవ్వాలని, పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. టెక్నికల్ సేవల కోసం ప్రత్యేకంగా డీజీపీ టెక్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనర్లు క్రైమ్ రివ్యూ తప్పకుండా నిర్వహించాలని, యూనిట్ హెడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని డీజీపీ ఆనంద్ ఆదేశించారు.

# మోటార్లకు మీటర్లు పెడితే పోటీ చేయం

- ఉచిత విద్యుత్ ఆపితే రాజకీయాల నుంచే తప్పుకుంటా
- లేకుంటే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా
- రైతుల ముసుగులో లబ్దికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- ధాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు పోస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్



**హైదరాబాద్, మే 30:** తెలంగాణలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసినా, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అదే విధంగా తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా అని మాజీ సీఎం కేసీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై స్పందించారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా విద్యుత్ పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని సమర్థంగా నిర్వహించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ చెప్పలేదని సీఎం పేర్కొన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పదేపదే లేవనెత్తుతోందని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, ప్రభుత్వం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తుంటే, గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న రూ.95 వేల కోట్ల అప్పులను తీర్చాల్సి వస్తోందన్నారు. తాము ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల్లోనే అప్పులు తీసుకుంటున్నామని వివరించారు.

### ధాన్యం కొనుగోలుపై కేంద్రంపై మండిపాటు

ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మద్దతు ధర ప్రకటించడం తప్ప ఒక్క గింజ కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించిందని, తడిచిన ధాన్యానికీ మద్దతు ధర చెల్లిస్తున్నామని తెలిపారు. సన్న వడ్లకు బోనస్ కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో బీజేపీ ఎంపీలు, నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేకపోతే వారి ఇళ్ల ముందే ట్రాక్టర్లతో వడ్లు పోస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం రాష్ట్ర ధాన్యంలో కేవలం 32 శాతం మాత్రమే కొనుగోలు చేస్తోందని ఆరోపించారు.

### హరీశ్‌రావుపై ఆసక్తికర వ్యాఖ్యలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తుపై కూడా సీఎం వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదని అన్నారు. గతంలో ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి వద్దకు వెళ్లారని, ప్రస్తుతం కూడా ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసని వ్యాఖ్యానించారు. ఇటీవల పార్టీ సమావేశాన్ని వదిలి ఢిల్లీకి ఎందుకు వెళ్లారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ భవిష్యత్తులో కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. ఇదులకుంట చెరువు అక్రమాలపై హరీశ్‌రావు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

### తెలంగాణపై వివాదాస్పద వ్యాఖ్యలకు చెక్

ఎన్టీఆర్ విగ్రహం, తెలంగాణ అంశాలపై ఇటీవల చెలరేగిన వివాదాలపై స్పందించిన సీఎం, ప్రాంతీయ లేదా కులపరమైన వివాదాలు సృష్టించడం బుద్ధిలేనితనమని అన్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ గడ్డపైనే పుట్టిందని, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలకు తాను దూరమని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో తనది విజయవంతమైన రాజకీయ కాంబినేషన్ అని సీఎం పేర్కొన్నారు. తమ నాయకత్వంలో పార్టీ వరుస విజయాలు సాధించిందని, భవిష్యత్తులోనూ అదే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహేశ్ గౌడ్‌కు కీలక పదవి దక్కే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఇప్పుడే ఆత్రుత అవసరం లేదని, తన దృష్టి మొత్తం రాష్ట్ర అభివృద్ధిపైనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# గంటన్నరలోనే రాష్ట్ర వేడుకలు!

- ఎండల తీవ్రతతో వేళల్లో మార్పు
- ఉదయానికే ముగింపు.. వేళల్లో మార్పులు
- 8.30కే ఆరంభం.. 10 గంటలకల్లా కార్యక్రమాల పూర్తి
- పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కొత్త షెడ్యూల్




**హైదరాబాద్, మే 30:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈసారి అధికారిక వేడుకలను ఉదయం వేళల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ ఉత్సవాలను గంటన్నర వ్యవధిలో ముగించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాన కార్యక్రమం ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానుంది. జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందనం, ప్రభుత్వ సందేశం, సాంస్కృతిక కార్యక్రమాలు సహా అన్ని అధికారిక కార్యక్రమాలను ఉదయం 10 గంటల కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదవుతున్న నేపథ్యంలో వేడుకలకు హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎండల బారిన పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఉదయం తర్వాత ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో కార్యక్రమాలను ముందుగానే నిర్వహించనున్నారు. వేడుకలకు వచ్చే ప్రజల కోసం తాగునీరు, మజ్జిగ, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, నీడ సదుపాయాలు, అత్యవసర చికిత్స ఏర్పాట్లు కల్పించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కూడా చేపట్టనున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడమే కాకుండా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎండల తీవ్రత మధ్య నిర్వహించే ఈ వేడుకల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

## కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు

### ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటా: బాల్క

**హైదరాబాద్, మే 30:** బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీస్‌లను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్లు చేసినట్లు ఆనంద్ తెలిపాడు.



# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

- 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యంగా రుతుపవనాలు..



**అమరావతి/హైదరాబాద్, మే 30:** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గడం లేదు. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో పలుచోట్ల 45 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో తీవ్ర ఎండలు నమోదవగా, మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ 1 నుంచి అక్టోబర్ వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఎల్‌నినో ప్రభావమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాల కొరత ఉండే అవకాశం ఉన్నట్లు హెచ్చరిస్తున్నారు. అయితే తెలంగాణలో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలాల పునరుద్ధరణకు ఉపయోగపడతాయని పేర్కొంది. వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ ఏడాది వానాకాలం 2018 పరిస్థితులను తలపించే అవకాశం ఉంది. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు కురిసినా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాల తీవ్రత తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. గత ఐదు నుంచి ఆరు సంవత్సరాలతో పోలిస్తే ఈసారి రుతుపవన వర్షాలు తక్కువగా ఉండొచ్చని చెబుతున్నారు. దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు కనిపించే అవకాశం ఉండగా, మధ్య తెలంగాణలో మాత్రం ఆశాజనక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు జూన్ రెండో వారంలో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, రైతులు పంటల ప్రణాళికలను వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎండలు, ఆలస్యమవుతున్న రుతుపవనాలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

# అధికారంలోకి వస్తాం.. 111జీవో ఎత్తివేస్తాం!

- తెలంగాణ రక్షణ సేనతోనే రాష్ట్ర హక్కుల పరిరక్షణ
- ఎలాంటి గ్యారంటీ లేకుండా యువతకు రూ.20 కోట్ల వరకు రుణాలు
- గుంపు మేస్త్రీపై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి
- టీఆర్ఎస్ చీఫ్ కవిత పిలుపు
- మొయినాబాద్ లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



**మొయినాబాద్:** తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే 111 జీవోను పూర్తిగా ఎత్తివేస్తామని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మొయినాబాద్ మండల కేంద్రంలో పర్యటించిన ఆమె, అక్కడ ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా టీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కవిత మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే బాగా వచ్చు అని చెప్పుకున్న ఆ గుంపు మేస్త్రీ, చివరకు ఇక్కడున్న ఆ ఒక్క వ్యాపారాన్ని కూడా పూర్తిగా ఊడగొట్టాడు" అని ఘాటుగా విమర్శించారు. ఈ గుంపు మేస్త్రీ అరాచకాలపై తిరగబడటానికి, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

### జీవో 111 ఎత్తివేతతోనే రైతులకు మేలు:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే అన్ని సమస్యలు సమసిపోతాయని ప్రజలు ఆశించారని, కానీ నేటికీ ఆ ఆకాంక్షలు నెరవేరలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాధించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి, ఇక్కడి ప్రజల హక్కులను కాపాడటానికే 'తెలంగాణ రక్షణ సేన' ఒక కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చిందని ఆమె పేర్కొన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఎకరం భూమి ధర వంద కోట్ల రూపాయలు పలుకుతోందని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలోని 120 గ్రామాలకు గుదిబండగా మారిన 111 జీవోను ఎత్తివేస్తేనే స్థానిక రైతులకు నిజమైన మేలు జరుగుతుందన్నారు. "ఇంట్లో పిల్లల పెళ్లిళ్ల కోసమో, అవసరాల కోసమో ఒక పావు ఎకరం భూమి అమ్ముకున్నా రైతులకు మంచి ధర వచ్చే పరిస్థితి ఉంటుంది. ఎన్నికల ముందు అన్ని పార్టీలు ఈ జీవో ఎత్తివేస్తామని చెబుతాయి కానీ, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. మా పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది.. 111 జీవోను రద్దు చేస్తుందని నేను మీకు హామీ ఇస్తున్నా" అని ప్రకటించారు.

### ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలి

చేవెళ్ల, మొయినాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ మంది రైతులు, రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడిన వ్యాపారులే ఉన్నారని, ఈ ప్రభుత్వం వల్ల వారంతా నష్టపోతున్నారని కవిత ఆరోపించారు. అందుకే ఈ పాలకులపై తిరుగుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తమ పార్టీ సిద్ధాంతాలను నమ్మి పెద్ద ఎత్తున మైనార్టీ సోదరులు పార్టీలో చేరుతున్నారని, వారి చేరికతో పార్టీ మరింత బలోపేతమైందని హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడున్న గంగా-జమునా తెహజీబ్ సంస్కృతిని, మత సామరస్యాన్ని చెడగొట్టాలని చూసే శక్తులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

### యువతకు, మహిళలకు పెద్దపీట:

తెలంగాణ వస్తే రాష్ట్రంలోని ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు వస్తాయని భావిస్తే నిరాశే మిగిలిందని కవిత వ్యాఖ్యానించారు. మహిళలకు కచ్చితంగా లబ్ధి చేకూర్చాలనే బలమైన సంకల్పంతోనే తాను సొంతంగా పార్టీ పెట్టానని వివరించారు. "ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా ఇక్కడి మహిళలు పడుతున్న కష్టాలు, సమస్యలన్నీ నాకు పూర్తిగా తెలుసు. అలాగే మన నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు రావాల్సి ఉంది" అని చెప్పారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు అవసరమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఎలాంటి శరతులు, గ్యారంటీలు లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు భారీ ఆర్థిక రుణాలను అందిస్తామని కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

### మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి, మే 30:** రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మైనర్, మేజర్ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, పాఠశాల భవనాలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలను విద్యార్థులు చూసిన వెంటనే చదువుపై ఆసక్తి పెరిగేలా, పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలురు, బాలికల వసతి గృహాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉ



ర్దూ మీడియం ప్రారంభానికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థలు, వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తున్నందున సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# హైదరాబాద్‌పై నజర్

- జీహెచ్ఎంసీ ఎన్నికలే ప్రధాన లక్ష్యమా?
- తెలంగాణ అస్తిత్వం వర్సెస్ సెటిలర్ ఓట్ల చర్చ
- మారుతున్న నగర రాజకీయ సమీకరణాలు
- గుర్తింపు రాజకీయాల వైపు మళ్లుతున్న ప్రచారం
- ప్రధాన పార్టీల ఫోకస్ అంతా గ్రేటర్‌పైనే



**హైదరాబాద్, మే 30:** గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నగర అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు, మూసీ ప్రక్షాళన, చెరువుల పరిరక్షణ వంటి పట్టణ అంశాలతో పాటు ప్రాంతీయ భావోద్వేగాలు, సామాజిక గుర్తింపు రాజకీయాలు కూడా ఎన్నికల చర్చలో భాగమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలు ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే హైదరాబాద్ ఓటర్ల మనోభావాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవల నగరంలో చోటుచేసుకున్న కొన్ని రాజకీయ, సామాజిక పరిణామాలు తెలంగాణ అస్తిత్వం, సెటిలర్ ఓటు, ప్రాంతీయ భావోద్వేగాల చుట్టూ కొత్త చర్చకు దారితీశాయి. సోషల్ మీడియాలో తెలంగాణ-ఆంధ్ర వాదనలు మళ్లీ వినిపించడం, రాజకీయ నాయకుల వ్యాఖ్యలు వైరల్ కావడం, కొన్ని ప్రతీకాత్మక అంశాలపై వివాదాలు చెలరేగడం నగర రాజకీయాలపై ప్రభావం చూపుతున్నట్లు కనిపిస్తోంది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మక ఎన్నికలుగా జీహెచ్ఎంసీ ఎన్నికలను రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నాయి. రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, మీడియా కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో ఆధిపత్యం సాధించడం ఏ పార్టీకి అయినా కీలకంగా మారింది. అందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మూడు పార్టీలు కూడా నగర ఓటర్లపై ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లో సెటిలర్ ఓటు ప్రభావం చాలా కాలంగా చర్చలో ఉన్న అంశమే. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో స్థిరపడిన ఓటర్లు అనేక డివిజన్లలో ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో తెలంగాణ ఉద్యమం ద్వారా రాజకీయ చైతన్యం పొందిన వర్గాలు కూడా తమ గుర్తింపును కీలక అంశంగా చూస్తున్నాయి. దీంతో సెటిలర్ ఓటు, తెలంగాణ అస్తిత్వ ఓటు రెండూ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ అభివృద్ధి, పరిపాలనను ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా, బీజేపీ జాతీయ రాజకీయ అంశాలతో పాటు నగరంలో తన బలాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని మళ్లీ ప్రజల ముందుకు తీసుకురావాలనే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే జీహెచ్ఎంసీ ఎన్నికల అసలు నరేటివ్ ఏదన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. నగర సమస్యలే ప్రధాన చర్చగా మారుతాయా? లేక తెలంగాణ అస్తిత్వం, ప్రాంతీయ భావోద్వేగాలు, గుర్తింపు రాజకీయాలే ఎన్నికల కేంద్రబిందువుగా నిలుస్తాయా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే హైదరాబాద్ రాజకీయాలు కేవలం అభివృద్ధి చర్చలకే పరిమితం కాకుండా కొత్త సామాజిక, రాజకీయ సమీకరణాల వైపు కదులుతున్నట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో పార్టీల ప్రచార వ్యూహాలు, ప్రజా స్పందనే ఈ ఎన్నికల దిశను నిర్ణయించే అవకాశముంది.



# కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధం

### జీవో-17 రద్దయ్యే వరకు పోరాటం ఆగదు: కేటీఆర్
### కాంట్రాక్టుల్లో రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం
### 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది
### 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తయారు చేస్తాం


**హైదరాబాద్, మే 30:** కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్డుపైకి తెచ్చిన జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీలు, వందలాది హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు అన్ని వర్గాలను నట్టేట ముంచిందని ఆరోపించారు. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్లలో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం చొప్పున మొత్తం 72 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించి, బడుగు వర్గాలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, పాలు, చికెన్, బ్రెడ్ వంటి వస్తువుల టెండర్లను కూడా పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు జీవో నెం.17ను తీసుకొచ్చారని ఆరోపించారు. దీనివల్ల వేలాది మంది చిన్న కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. జీవో నెం.17 రద్దయ్యే వరకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కాంట్రాక్టుల్లో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం "రెన్యువల్ ముఖ్యమంత్రి" మాత్రమేనని విమర్శించిన ఆయన, 2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బడుగు, బలహీన వర్గాలకు చెందిన 50 వేల మంది యువతను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థిని భవితకు అండగా మంత్రి కోమటిరెడ్డి

### స్కూల్ ఫీజు రూ.60 వేలు చెల్లింపు..
### అదనంగా రూ.20 వేలు ఆర్థిక సాయం

**హైదరాబాద్, మే 30:** రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. పదో తరగతిలో 600 మార్కులకు 582 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థిని భవిత, ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్కూల్ ఫీజు చెల్లించలేక సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విషయం సోషల్ మీడియా ద్వారా మంత్రి దృష్టికి చేరింది. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి, విద్యార్థిని వివరాలు తెలుసుకుని స్కూల్ ప్రిన్సిపల్‌తో స్వయంగా మాట్లాడారు. అనంతరం భవితను మినిస్టర్స్ క్వార్టర్స్‌కు పిలిపించి ఆమె విద్యాభ్యాసం, కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీశారు. పాలిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 634వ ర్యాంకు సాధించిన భవిత ఉన్నత విద్యపై ఆసక్తి వ్యక్తం చేయగా, మంత్రి వెంటనే స్కూల్‌కు బకాయిగా ఉన్న రూ.60 వేల ఫీజును చెల్లించి సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే తక్షణ అవసరాల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన మంత్రి, అవసరమైతే ల్యాప్‌టాప్ సహా ఇతర సాయాల కోసం తనను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మానవత్వంతో చేసే సేవే నిజమైన దైవత్వమని పేర్కొన్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో తమ సమస్య పరిష్కారమైందని, ఆయన చేసిన సహాయాన్ని జీవితాంతం మర్చిపోలేమని విద్యార్థిని భవిత, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





# జనాభా పెరుగుదల కాదు వసతుల కల్పనే దేశ ప్రగతికి మూలాధారం!

దేశాభివృద్ధి అనగానే చాలామంది జీడీపీ వృద్ధి, పారిశ్రామిక ప్రగతి, సాంకేతిక పురోగతి వంటి అంశాలను ప్రస్తావిస్తారు. కానీ ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందిందా లేదా అన్నది అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను బట్టి నిర్ణయించాలి. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, సురక్షిత నివాసం, ఉపాధి అవకాశాలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, సామాజిక భద్రత అందుతున్నాయా లేదా అన్నదే అసలు కొలమానం. ఈ అంశాల్లో ఇంకా అనేక లోపాలు ఉన్న దేశంలో జనాభా పెంపును ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనాభా పెంపుపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. మూడో సంతానానికి రూ.30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించడం ద్వారా ఎక్కువ మంది పిల్లలను కనాలని పరోక్షంగా ప్రోత్సహించారు. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పునర్విభజనలో నష్టం జరిగే అవకాశాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. అయితే రాజకీయ లాభనష్టాల కంటే ప్రజల జీవన ప్రమాణాలే ముఖ్యమన్న వాస్తవాన్ని పాలకులు మరవకూడదు. ప్రస్తుతం దేశంలో ఉన్న జనాభాకే సరిపడా మౌలిక వసతులు అందుబాటులో లేవన్నది వాస్తవం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లేమి, ఉపాధ్యాయుల కొరత సమస్యలు కొనసాగుతున్నాయి. లక్షలాది మంది యువత ఉన్నత విద్య పూర్తిచేసినా ఉపాధి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. పట్టణాల్లో నివాస సమస్యలు, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, తగిన మౌలిక వసతుల లేమి రోజురోజుకు పెరుగుతున్నాయి.

దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువకులు ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నప్పటికీ, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నిరుద్యోగం ఇప్పటికే తీవ్రమైన సమస్యగా మారింది. మరోవైపు వ్యవసాయ రంగం కూడా అనిశ్చితితో కొట్టుమిట్టాడుతోంది. రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీరు, రుణ సౌకర్యాల కోసం పోరాడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో జనాభా పెంపు గురించి మాట్లాడటం కంటే ప్రస్తుతం ఉన్న జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చే దిశగా చర్యలు తీసుకోవడం అత్యవసరం. జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక ప్రభావాలను కూడా విస్మరించరాదు. అధిక జనాభా కారణంగా వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. భూమి, నీరు, ఆహార వనరుల వినియోగం పెరుగుతుంది. పర్యావరణంపై అదనపు భారం పడుతుంది. ఇప్పటికే వాతావరణ మార్పులు, నీటి కొరత, పర్యావరణ సంక్షోభం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా నియంత్రణను వదిలేసి పెంపును ప్రోత్సహించడం భవిష్యత్ తరాలపై మరింత భారం మోపే ప్రమాదం ఉంది. మహిళల కోణంలో ఈ అంశాన్ని పరిశీలిస్తే మరిన్ని ఆందోళనకర అంశాలు కనిపిస్తాయి. ఇప్పటికీ దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు వివాహం, సంతానం, కుటుంబ బాధ్యతల విషయంలో సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు ముందుకు సాగుతున్న తరుణంలో ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రోత్సహించడం వారిపై అదనపు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. ప్రసూతి సమయంలో సరైన వైద్యం అందక తల్లీబిడ్డల మరణాలు సంభవిస్తున్న సంఘటనలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. పిల్లలను కనమని చెప్పడం సులభమే. కానీ వారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు కల్పించగలమా అనే ప్రశ్నకు ముందుగా సమాధానం చెప్పాలి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. పిల్లల పోషణ, విద్య, ఆరోగ్యం కోసం మరిన్ని వనరులు కేటాయించాలి. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇవన్నీ చేయకుండా కేవలం నగదు ప్రోత్సాహకాలు ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, జనాభా ఎక్కువగా ఉండటం వల్లే దేశం బలంగా మారుతుందనుకోవడం పొరపాటు. ప్రపంచంలో జనాభా తక్కువగా ఉన్న అనేక దేశాలు అభివృద్ధిలో అగ్రస్థానాల్లో ఉన్నాయి. వారి బలం జనాభా సంఖ్యలో కాదు, మానవ వనరుల నాణ్యతలో ఉంది. విద్యావంతులు, నైపుణ్యం కలిగిన యువత, సమర్థవంతమైన పరిపాలన, నాణ్యమైన మౌలిక వసతులే ఆ దేశాల విజయానికి కారణం. ప్రభుత్వాలు ప్రజల సంఖ్య పెంచడం కంటే ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంపై దృష్టి సారించాలి. ప్రతి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి పిల్లవాడికి నాణ్యమైన విద్య, ప్రతి యువకుడికి ఉపాధి అవకాశం, ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందేలా చర్యలు తీసుకోవాలి. మహిళల విద్య, ఉపాధి, భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మౌలిక వసతుల అభివృద్ధి, మానవ వనరుల నాణ్యత పెంపు ద్వారానే దేశం నిజమైన అభివృద్ధిని సాధించగలదు. అందుకే నేడు అవసరమైన చర్చ "ఎంత మంది పిల్లలను కనాలి?" అనేది కాదు. "ఇప్పుడున్న ప్రజలకు ఎంత మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించగలుగుతున్నాం?" అనేదే. జనాభా పెంపు కంటే మౌలిక వసతుల కల్పనే దేశ భవిష్యత్తును నిర్ణయించే అసలైన అంశం. ప్రజల అవసరాలను తీర్చగలిగినప్పుడే అభివృద్ధి సార్థకమవుతుంది. లేకపోతే జనాభా పెరుగుదల మరో భారంగా మారే ప్రమాదం ఉంది.

# ఉగ్ర కుట్ర భగ్నం



- ఢిల్లీ, ముంబై, పంజాబ్‌లలో భారీ దాడులకు కుట్ర
- ఐఎస్ఐ, దావూద్ లింకులతో 9 మంది అరెస్ట్
- ఉన్నత విద్యావంతులే సూత్రధారులు!



**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున ఉగ్రదాడులు జరపడానికి వ్యూహం రచించిన తొమ్మిది మంది నిందితులను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్టు చేశారు. పట్టుబడిన ఈ ముఠాకు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, అలాగే అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో నేరుగా సంబంధాలు ఉన్నట్లు పోలీసులు ధృవీకరించారు. నిందితులు ఢిల్లీ, ముంబై, పంజాబ్ ప్రాంతాలకు చెందిన వారని, వీరిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారని ఉన్నతాధికారులు వెల్లడించారు. అరెస్ట్ చేసిన సమయాల్లో వారి స్థావరాల నుంచి పలు అధునాతన ఆయుధాలను, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఉగ్రవాదులు దేశంలోని కీలక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో తేలింది. ముఖ్యంగా అణుకేంద్రాలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లు, పవర్‌ప్లాంట్లు వంటి వ్యూహాత్మక ప్రాంతాలపై దాడులు చేయడానికి వీరు స్కెచ్ వేశారు. ప్రజల రక్షణలో ఉండే భద్రతా దళాలను కూడా టార్గెట్ చేసే యోచనలో వీరు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఉగ్రమూక కదలికలపై గత కొంతకాలంగా నిరంతరం నిఘా ఉంచిన పోలీస్ యంత్రాంగం, సరైన సమయంలో దాడి చేసి వీరిని అదుపులోకి తీసుకుంది. ఈ కుట్ర వెనుక పాకిస్థాన్ పాత్ర ఏ మేరకు ఉంది, వీరికి విదేశాల నుంచి అందుతున్న ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, మరియు వీరిని నడిపిస్తున్న విదేశీ హ్యాండ్లర్లు ఎవరు అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారంతో అక్కడి పోలీసులు పూర్తిగా అప్రమత్తమయ్యారు. నిఘా వర్గాలు, కేంద్ర పారామిలిటరీ దళాల సమన్వయంతో అన్ని జిల్లాల పోలీస్ యూనిట్లు హైఅలర్ట్‌లో ఉన్నాయి. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో 15 మంది మరణించిన ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రస్తుత కేసులో పట్టుబడిన నిందితులందరూ ఉన్నత విద్యావంతులు కావడంతో, సాంకేతికతను వాడుకుంటూ సాగుతున్న 'వైట్ కాలర్ ఉగ్రవాదం'పై కూడా పోలీసులు గట్టి నిఘా పెట్టారు.



# సాంకేతిక సమస్యతో సీయూఈటీ పరీక్ష ఆలస్యం

## కేంద్రంపై ప్రతిపక్షాల విమర్శలు

**న్యూఢిల్లీ, మే 30:** డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) శనివారం పలు పరీక్షా కేంద్రాల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోగా, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత అతిషి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. "మొదట నీట్, తరువాత సీబీఎస్ఈ, ఇప్పుడు సీయూఈటీ.. జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో కేంద్రం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆమె సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కూడా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. "నాలుగు పరీక్షలు, కోటి మంది విద్యార్థులు.. కానీ ఒక్క పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారు" అని విమర్శించారు. విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ప్రభుత్వానికి యువతే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ అంశంపై స్పందించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ), కొన్ని కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన కారణంగా పరీక్ష ప్రారంభంలో జాప్యం జరిగిందని తెలిపింది. అయితే సమస్యను వెంటనే పరిష్కరించి పరీక్షలను సజావుగా నిర్వహించామని వెల్లడించింది. ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అదనపు సమయం కేటాయించినట్లు పేర్కొంది. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించాల్సిన కొన్ని షిఫ్టుల సమయాల్లో కూడా మార్పులు చేసినట్లు ఎన్‌టీఏ తెలిపింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసినట్లు వెల్లడించింది. కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలతో పాటు పలు ప్రైవేటు యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సీయూఈటీ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ ఏడాది పరీక్షలు మే 11 నుంచి మే 31 వరకు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

# ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి

## ఆర్‌బీఐ నివేదికలో పలు అంశాలు వెల్లడి

**ముంబయి, మే 30:** దేశంలో నకిలీ నోట్ల అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు 2025-26లో 5.7 శాతం పెరిగిందని భారత రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. దీనికి ఆన్‌లైన లేదా కరెన్సీ రహిత ప్రవాహం పెరగాలని సూచిస్తున్నారు. నోట్ల రద్దు చేసినా నకిలీ నోట్ల ముద్రణ ఆగడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ముఖ విలువ రూ.200, రూ.500 ఉన్న నోట్లే ఇందులో ఎక్కువగా వుంటున్నాయని తెలిపింది. 2025-26లో మొత్తంగా నకిలీ నోట్ల సంఖ్య 2,29,746కి పెరిగిందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2,17,396గా వుందని ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2024-25లో నకిలీ రూ.500 నోట్లు 20.5 శాతం పెరిగాయి. అంతకుముందు 1,17,722 గుర్తించగా, తర్వాత ఆ సంఖ్య 1,41,907కి చేరింది. అలాగే రూ.20 ముఖ విలువ ఉండే నోట్లు నకిలీ చలామణి కూడా బాగా పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. ఏడాది క్రితం 253 నోట్లు బయటపడగా అవి 47.4శాతం పెరిగి 373కి చేరాయి. 200 నకిలీ నోట్ల సంఖ్య తగ్గింది. 2024-25లో 32,600 వుండగా, 2025-26లో 30,591కి పడిపోయింది. అలాగే వంద నోట్ల నకిలీ కూడా తగ్గింది. 51,069 నుండి 45,621కి పడిపోయింది. రూ.50నోట్లు నకిలీ కూడా 12,015 నుండి 10,274కి తగ్గింది. 2 వేల నోట్లు చలామణి నుండి ఉపసంహరించడంతో వాటి నకిలీ దాదాపు పడిపోయిందని చెప్పవచ్చు. అంతకుముందు ఏడాదిలో 3508 బయటపడగా, 2025-26లో ఈ సంఖ్య 824కి తగ్గిపోయింది. ఆర్ బి ఐలో 2.4శాతం అంటే 5,412 నకిలీ నోట్లు కనుగొనగా ఇతర బ్యాంకుల్లో మొత్తంగా 97.6శాతం అంటే 2,24,334 నోట్లు కనుగొన్నారని నివేదిక పేర్కొంది. ఇంకా పోలీసులు, ఇతర ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నవి ఇందులో కలపలేదని తెలిపింది. పాడైపోయిన నోట్లను తీసివేయడం బాగా తగ్గిందని నివేదిక పేర్కొంది. 2025-26లో ఈ సంఖ్య 1.72లక్షల నోట్లుగా వుండగా అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 2.38 లక్షలుగా వుంది.




# ఆపరేషన్ సిందూర్ 2.0కు సిద్ధం..

## పాక్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 30:** అవసరమైతే 'ఆపరేషన్ సిందూర్ 2.0' చేపట్టేందుకు భారత సాయుధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. దేశ భద్రతకు ఎలాంటి ముప్పు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత త్రివిధ దళాలకు ఉందని పేర్కొన్నారు. పుణెలో నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) 150వ పాసింగ్ ఔట్ పరేడ్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, శాంతి అనేది తాత్కాలిక పరిస్థితి మాత్రమేనని, అవసరమైతే ఆపరేషన్ సిందూర్ రెండో దశకు కూడా సైన్యం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్ యుద్ధాలు కేవలం భూమి, సముద్రం, ఆకాశానికే పరిమితం కావని, అంతరిక్షం, సైబర్, కాగ్నిటివ్ డొమెయిన్లలో కూడా పోరాటాలు సాగే అవకాశాలు ఉన్నాయని ద్వివేది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సైనిక వ్యూహాలు, భద్రతా చర్యలు, సాంకేతిక సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించే శక్తి తమకు ఉందని నిరూపించిందన్నారు. భవిష్యత్ యుద్ధాల్లో ప్రజల విశ్వాసం, జాతీయ ఐక్యత కూడా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత సాయుధ దళాల సామర్థ్యంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ఇందులో యువత పాత్ర ఎంతో ముఖ్యమని ఆర్మీ చీఫ్ తెలిపారు. ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా డ్రోన్ బెటాలియన్లు, దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్లు, భైరవ్ బెటాలియన్లు వంటి సాంకేతిక ఆధారిత ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. నెట్‌వర్కింగ్, డేటా ఆధారిత యుద్ధ వ్యూహాలు భవిష్యత్‌లో కీలక వనరులుగా మారనున్నాయని పేర్కొన్న ఆయన, డ్రోన్ల వినియోగంపై అన్ని సైనిక శిక్షణ అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. భారత భద్రతకు ఎలాంటి ముప్పు వచ్చినా తగిన ప్రతిస్పందన ఇవ్వడానికి త్రివిధ దళాలు అప్రమత్తంగా, సర్వసన్నద్ధంగా ఉన్నాయని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు.



# మద్యం కేసులో కీలక మలుపు

**జగన్ మాజీ పీఏపై ఫోకస్.. కేఎన్ఆర్ ఆస్తులపై సిట్ దృష్టి**

**సోదాల్లో లభించిన వివరాలపై కొనసాగుతున్న విచారణ**

**మాజీ ముఖ్యమంత్రి పాత్రపై రాజకీయ వర్గాల్లో చర్చ**

**ఆరోపణలను ఖండిస్తున్న వైసీపీ శ్రేణులు**

**అమరావతి, మే 30:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం రేపుతున్న మద్యం కుంభకోణం దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన కే. నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్) చుట్టూ దర్యాప్తు ముమ్మరమవుతోంది. ఇటీవల నిర్వహించిన సోదాల్లో లభించిన పలు ఆర్థిక లావాదేవీల వివరాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించాయి. దర్యాప్తు వర్గాల సమాచారం ప్రకారం, కేఎన్ఆర్‌కు సంబంధించిన ఆస్తుల మూలాలు, వాటి కొనుగోళ్ల వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా విచారణ చేపట్టింది. తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో గుర్తించిన ఆస్తులు, పెట్టుబడుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. మద్యం పాలసీ అమలు సమయంలో జరిగిన లావాదేవీలు, వాటి ద్వారా సమకూరిన నిధులు ఆస్తుల రూపంలోకి మారాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకు ఖాతాలు, భూ కొనుగోలు ఒప్పందాలు, ఇతర ఆర్థిక పత్రాలను అధికారులు విశ్లేషిస్తున్నారు. కేఎన్ఆర్ మాజీ ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక బాధ్యతలు నిర్వహించినందున ఈ వ్యవహారం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దర్యాప్తు పురోగతిపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. అయితే మాజీ ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రమేయంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు కేంద్ర దర్యాప్తు సంస్థలకు కూడా చేరే అవకాశాలపై చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మనీలాండరింగ్ కోణంలో అమలు సంచాలక సంస్థ (ఈడీ) దృష్టి సారించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఈ వ్యవహారంలో వస్తున్న ఆరోపణలను వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తమ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు. ప్రస్తుతం కేఎన్ఆర్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, ఆస్తుల మూలాలు, వాటి వెనుక ఉన్న వ్యక్తుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసు పురోగతి రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నదిలో యువకులు గల్లంతు


- ఈతకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న ఐదుగురు
- ఒకరి మృతి.. మరొకరిని కాపాడిన స్థానికులు



**కర్నూలు, మే 30:** కర్నూలు జిల్లా మంత్రాలయం సమీపంలోని నదిలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఈత కొట్టేందుకు నదిలోకి దిగిన ఐదుగురు యువకులు ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. హైదరాబాద్‌కు చెందిన యువన్ చంద్ర, సతీశ్, మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర, ధను, ఉరవకొండకు చెందిన సంధ్య నది వద్దకు వెళ్లి ఈతకు దిగారు. ఈ సమయంలో అకస్మాత్తుగా నీటి ప్రవాహంలో చిక్కుకుని గల్లంతైనట్లు సమాచారం. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మృతుడు హైదరాబాద్‌కు చెందిన యువకుల్లో ఒకరిగా గుర్తించినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మిగిలిన యువకుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

- 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యంగా రుతుపవనాలు..




**అమరావతి/హైదరాబాద్, మే 30:** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గడం లేదు. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో పలుచోట్ల 45 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో తీవ్ర ఎండలు నమోదవగా, మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ 1 నుంచి అక్టోబర్ వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఎల్‌నినో ప్రభావమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాల కొరత ఉండే అవకాశం ఉన్నట్లు హెచ్చరిస్తున్నారు. అయితే తెలంగాణలో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలాల పునరుద్ధరణకు ఉపయోగపడతాయని పేర్కొంది. వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ ఏడాది వానాకాలం 2018 పరిస్థితులను తలపించే అవకాశం ఉంది. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు కురిసినా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాల తీవ్రత తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. గత ఐదు నుంచి ఆరు సంవత్సరాలతో పోలిస్తే ఈసారి రుతుపవన వర్షాలు తక్కువగా ఉండొచ్చని చెబుతున్నారు. దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు కనిపించే అవకాశం ఉండగా, మధ్య తెలంగాణలో మాత్రం ఆశాజనక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు జూన్ రెండో వారంలో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, రైతులు పంటల ప్రణాళికలను వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎండలు, ఆలస్యమవుతున్న రుతుపవనాలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

# గొడ్డలి రాజకీయాలతో ప్రజాస్వామ్యం నడవదు

- వివేకా హత్య కేసులో సునీత పోరాటానికి మద్దతు
- ఆయుధాలు పట్టిన నక్సలైట్లే నెగ్గలేకపోయారు.. వీళ్లు గొడ్డళ్లతో నెగ్గుకురాగలరా?
- తండ్రి హత్యపై సునీత చేస్తున్న ఒంటరి పోరాటంలో పూర్తి న్యాయం ఉంది
- ఎన్‌టీఆర్ భవన్‌లో సీఎం ఇష్టాగోష్టి
- రాజ్యసభ సీట్లపై ముమ్మర చర్చలు.. ఆశావహులకు చంద్రబాబు హామీ
- తెలంగాణపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బక్కని నర్సింహులుకు క్లాస్!



**అమరావతి:** ఆధునిక సమాజంలో హింస, హత్య రాజకీయాలు చేసేవారిని ప్రజలు ఏమాత్రం ఆదరించరని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "పూర్వం అధునాతన ఆయుధాలు పట్టిన నక్సలైట్లే గన్ ద్వారా రాజ్యాధికారాన్ని సాధించలేకపోయారు. అలాంటిది ఈ రోజుల్లో గొడ్డళ్లతో రాజకీయాలు చేస్తూ వీళ్లు ఎలా నెగ్గుకురాగలరు?" అని చంద్రబాబు ప్రశ్నించారు. హత్య రాజకీయాలు చేసిన వాళ్లు రాష్ట్రాన్ని ఏలవచ్చు కానీ, బాధితులు మాత్రం కనీసం జిల్లా రాజకీయాలు కూడా చేయకూడదనే విచిత్రమైన సిద్ధాంతాన్ని వైసీపీ నమ్ముతోందని విమర్శించారు. నేటి తరం యువతకు కూడా వీరి ఫ్యాక్షనిజం, కుట్రల గురించిన పూర్తి విషయాలు ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతున్నాయన్నారు.

**సునీత పోరాటానికి పూర్తి మద్దతు:**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత నర్రెడ్డి చేస్తున్న న్యాయపోరాటానికి సీఎం చంద్రబాబు పూర్తి మద్దతు ప్రకటించారు. సునీత చేస్తున్న పోరాటంలో వంద శాతం న్యాయం ఉందని, తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు కూతురిగా ఆమెకు ఖచ్చితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆమె ఒంటరిగా చేసిన ఈ ధీరోచిత పోరాటం వల్లే నేటికీ ఆ కేసు సజీవంగా ఉందన్నారు. బాధితులకు అండగా ఉంటూ, ఇలాంటి ఘోరాలకు పాల్పడిన వారిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టడం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యతని అభిప్రాయపడ్డారు. ఏపీలో 'సైకో' అనే పదం కంటే 'గొడ్డలి పార్టీ' అనే అంశాన్నే ప్రజలు బలంగా గుర్తించారని, ఈ నిజాలు వెలుగులోకి వస్తుండటంతోనే అవతలి వైపు ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. మూడు దశాబ్దాల క్రితమే కడప జిల్లాలోని పాలెగాళ్ల రాజ్యంపై వచ్చిన ఒక పుస్తకాన్ని ఇప్పుడు సమాజం మొత్తం చదువుతోందని, ఇలాంటి హింసాత్మక ప్రవృత్తి గలవారు ప్రజాస్వామ్యానికి ఏమాత్రం పనికిరారని చంద్రబాబు స్పష్టం చేశారు.

**రాజ్యసభ సీట్లపై నేతల విజ్ఞప్తి:**

మీడియా ఇష్టాగోష్టి అనంతరం సీఎం చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నేతలు తమకు రాజ్యసభ అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్ రావు, రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి సీఎంను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నేతలతో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించిన చంద్రబాబు.. రాజ్యసభ స్థానాలతో పాటు, ఇటీవల ముగిసిన పార్టీ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'మహానాడు' తదుపరి కార్యాచరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మరియు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని, కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చించిన తర్వాతే రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని ఆశావహులకు హామీ ఇచ్చారు.

**తెలంగాణ గడ్డపైనే టీడీపీ పుట్టింది..**

ఇదే సమావేశంలో తెలంగాణ టి.టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మహానాడు వేదికగా 'తెలంగాణ అనే పదం డిక్షనరీలోనే లేదు' అంటూ బక్కని చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "ఎంతో చరిత్ర, సుదీర్ఘ నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏ ఒక్కరి మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడకూడదు" అని క్లాస్ తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ గడ్డపైనే పుట్టిందని, ఆ రాష్ట్రంలో టీడీపీకి ఇప్పటికీ బలమైన కేడర్ ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ నుంచి తరలివచ్చి మహానాడును విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, మహానాడులో ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రతి ఒక్క కార్యకర్త ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు.

# హైబ్రిడ్ విధానంలో మహానాడు విజయవంతం

**కృషి చేసిన నేతలను అభినందించిన చంద్రబాబు**

**అమరావతి, మే 30:** తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే.. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని అన్నారు.

# ఏపీపై కాంగ్రెస్ ఫోకస్

## షర్మిళకు రాజ్యసభ ఛాన్స్?

- ఆంధ్రప్రదేశ్‌పై అధిష్టానం ప్రత్యేక దృష్టి
- కర్ణాటక కోటాలో అవకాశం కల్పించే యోచన
- వైఎస్ వారసత్వాన్ని తిరిగి చేరువ చేసే వ్యూహం
- గాంధీ కుటుంబం మద్దతు షర్మిళకు ప్లస్
- కేవీపీ, రఘువీరా పేర్లు పరిశీలనలోనే
- పీసీసీ అధ్యక్షురాలి చురుకుదనానికి గుర్తింపు
- ఏపీలో పార్టీ పునర్నిర్మాణానికి రాజ్యసభ అస్త్రం
- కాంగ్రెస్ భవిష్యత్ వ్యూహంలో షర్మిళ కీలకం?

**అమరామతి, మే 30:** ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించింది. తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పార్టీ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో దక్షిణాదిలో బలహీనంగా ఉన్న ఏపీని తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో జరుగుతున్న రాజ్యసభ ఎన్నికలను పార్టీ వ్యూహాత్మకంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. రాష్ట్రంలో పార్టీ శ్రేణులకు నూతన ఉత్సాహం కల్పించడంతో పాటు, కాంగ్రెస్ ఇంకా ప్రత్యామ్నాయ శక్తిగానే ఉందనే సందేశాన్ని పంపాలనే లక్ష్యంతో రాజ్యసభ అవకాశం ఏపీ నేతకు ఇవ్వాలన్న ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ పేరు బలంగా వినిపిస్తోంది. పార్టీ పెద్దల పరిశీలనలో పలువురు సీనియర్ నాయకుల పేర్లు ఉన్నప్పటికీ, ప్రస్తుతం షర్మిళకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి వంటి విధేయ నేతలు రేసులో ఉన్నప్పటికీ, భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా చురుకైన నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే అభిప్రాయం అధిష్టానంలో ఉన్నట్లు సమాచారం. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తెగా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉండటం, పీసీసీ అధ్యక్షురాలిగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు నిర్వహించడం, మీడియా దృష్టిని ఆకర్షించగల సామర్థ్యం కలిగి ఉండటం షర్మిళకు ప్రధాన బలాలుగా మారాయి. మహిళా నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలనే కాంగ్రెస్ విధానం కూడా ఆమెకు అనుకూలంగా కనిపిస్తోంది. ప్రస్తుతం కర్ణాటకలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అందులో కాంగ్రెస్‌కు మూడు స్థానాలు దక్కే అవకాశం ఉంది. ఒక స్థానం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఖాయంగా భావిస్తుండగా, మిగిలిన స్థానాల్లో ఒకదాన్ని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించే అంశాన్ని కాంగ్రెస్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జూన్ 8 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కావడంతో అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే షర్మిళ ఇటీవల రాహుల్ గాంధీని కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు కర్ణాటకలోని కీలక కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో ఆమెకు ఉన్న సాన్నిహిత్యం కూడా అనుకూల అంశంగా మారినట్లు చెబుతున్నారు. వైఎస్ జగన్ కాంగ్రెస్‌ను వీడి వెళ్లిన తర్వాత రాష్ట్రంలో పార్టీ బలహీనపడింది. వైఎస్సార్ అభిమానులను తిరిగి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలంటే షర్మిళ నాయకత్వం ఉపయోగపడుతుందని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నట్లు సమాచారం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కూడా ఈ విషయంలో సానుకూలంగా ఉన్నారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సీనియర్ నేతలతో పోలిస్తే షర్మిళ అభ్యర్థిత్వానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్టీని క్షేత్రస్థాయిలో చురుగ్గా ఉంచడంతో పాటు, వైఎస్ వారసత్వాన్ని కాంగ్రెస్‌తో అనుసంధానం చేసే ప్రయత్నంలో షర్మిళ కీలక పాత్ర పోషించగలరని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ సంప్రదాయ ఓటు బ్యాంకును తిరిగి సాధించడం, పార్టీ నాయకత్వాన్ని నిలబెట్టడం, వైసీపీ ప్రభావాన్ని ఎదుర్కోవడం వంటి సవాళ్లు షర్మిళ ముందున్నాయి. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు కనిపిస్తున్న అత్యంత గుర్తింపు కలిగిన నాయకురాలు షర్మిళేనన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. రాజ్యసభ అవకాశం ఖరారైతే అది కేవలం వ్యక్తిగత పదవి కాకుండా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పునర్నిర్మాణానికి అధిష్టానం ఇస్తున్న ప్రాధాన్యతకు సంకేతంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే, షర్మిళ రాజకీయ ప్రస్థానంలో రాజ్యసభ కొత్త మలుపు కావచ్చునే అంచనాలు పెరుగుతున్నాయి.



# టీబీ ముక్తా భారత్ అభియాన్ లో భాగంగా.. క్రమంగా మందులు వాడితే టీబీ నయం అవుతుంది

**ఎం.హెచ్.పీ డాక్టర్. భువనేశ్వరి, డాక్టర్. తులజారామ్**



**యాలాల మండలం, మే,30(సమయం న్యూస్) :** క్రమంగా మందులు వాడితే టీబీ నయం అవుతుంది ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్. భువనేశ్యవారి, డాక్టర్. తులజారామ్ టీబీ ముక్తా భారత్ అభియాన్ భాగంగా శనివారం యాలాల మండలం లోని హాజీపూర్, కొకట్ గ్రామాలలో ఉచిత ఎక్రే క్యాంపు నిర్వహించారు ఈ సందర్బంగా డాక్టర్. భువనేశ్వరి మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని ఎంత తొందరగా గుర్తించి మందులు ప్రారంభిస్తే అంత తొందర వ్యాధి తక్కువ అవుతుంది టీబీ వ్యాధి ను సమాజంలో నుండి తరిమివేయడానికి ప్రభుత్వం శతవిధాలా కృషి చేస్తుండుంది అందులో భాగంగా నే ఈ టీబీ ముక్తా అభియాన్ కార్యక్రమం నిర్వహితున్నాం అని ఆమె తెలిపారు మండలం లోని ప్రజలు ఈ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారుఈ హాజీపూర్ లో 123 మందికి, కొకట్ లో 58మందికి ఎక్రే తీయడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్. శ్రవంతి, డాక్టర్. తులజారామ్,ఎం.ఎల్.హెచ్. పి వైష్ణవి టీబీ సూపెరవైజర్ రహత్,ఎం.పి.హెచ్.ఏ సిద్దయ్య,ఏ.ఎన్. ఎం వెంకటమ్మ,వీరమణి ఎక్రే టెక్నీషియన్ రవి. ఆశలు పాల్గొన్నారు

# "పొగాకు వద్దు - ఆరోగ్యం ముద్దు"పొగాకు రహిత సమాజం

**- మనందరి లక్ష్యం -జూనియర్ సివిల్ జడ్జి అవినాష్**




**నారాయణపేట, మే,30(సమయం న్యూస్) :** నారాయ ణపేట లోని ఆర్.డి.ఓ ఆఫీస్ లోని డీఎండహెచ్ఓ ఆధ్వర్యములో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన గౌరవ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ అధ్యక్షతన 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31వ తేదీన మనం 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' జరుపుకుం టున్నాము.పొగాకు వల్ల కలిగే ప్రాణాంతక అనారోగ్య సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. పొగాకు వాడకం అనేది కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలను కూడా ఆర్థికంగా, మానసికంగా చిన్నాభిన్నం చేస్తుంది. ఎంతోమంది చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. కాబట్టి, మన ఆరోగ్యం, మన కుటుంబాల భద్రత కోసం మనం ఈ రోజే పొగాకుకు దూరంగా ఉండాలని గట్టిగా నిర్ణయించుకోవాలి.పొగాకును ఏ రూపంలో తీసుకున్నా -- సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ లేదా జర్దా -- అది ప్రాణాలకు హానికరమే. పొగాకులో ఉండే నికోటిన్ అనే విష పదార్థం మనిషికి త్వరగా వ్యసనపరుడిగా మారు-



స్తుంది. దీనివల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, నోరు మరియు గొంతు క్యాన్సర్, గుండెపోటు వంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయి. ధూమపానం చేసేవారికే కాకుండా, ఆ పొగను పీల్చే చుట్టుపక్కల వారికి (ఘుంంఅజవ ంఎశీన-వతీం) కూడా సమానమైన ప్రమాదం ఉంది.బాల్య వివాహాల కి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి. బాల్యకార్మిక వ్యవస్థ ని రూపుమాపాలి. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మిపతి గౌడ్ తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి డాక్టర్ జయచంద్ర మోహన్ (డీఎండహెచ్ఓ), డాక్టర్ లక్ష్మికాంత్, డాక్టర్ జాం రాజు, ఆంజనేయులు (ఏ.స్.ఐ), రఘువీర్(సీనియర్ అడ్వకేట్) మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికారాబాద్ పట్టణంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్, గంజాయి, మద్యం సీజ్.. తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు..

■ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు.





**వికారాబాద్, మే,30 (సమయం న్యూస్):** వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఆధ్వర్యంలో భారీ ప్రత్యేక తనిఖీలు (Special Drive) నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి సేవిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద నుండి సుమారు 2 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, ఇందిరానగర్ కాలనీలో కొందరు యువకులు ఒక ఇంటి ముందు గుమిగూడి మద్యం సేవిస్తుండగా గమనించిన పోలీసులు, సదరు ఇల్లాన్ని తనిఖీ చేసి అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన 55 బీర్ బాటిల్లు, 43 క్వాటర్ ల మద్యం సీసాలను సీజ్ చేశారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పలు లాడ్జీలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 15 సంవత్సరాల మైనర్ బాలుడిని పోలీసులు గుర్తించి విచారించగా అతని పేరు శ్రీకాంత్, రుక్మాపూర్, పెద్దేముల్ మండలం నివాసిని అని, అతడు ఇంట్లో నుండి పారిపోయి వచ్చినట్లు తేలింది. డీఎస్పీ అంజయ్య తక్షణమే స్పందించి బాలుడి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, వారిని పిలిపించి బాలుడిని సురక్షితంగా అప్పగించారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే, పాపిలోన్ డివిజన్ బృందంతో కలిసి జరిపిన తనిఖీల్లో హైదరాబాద్ వెళ్ళేందుకు రైల్వే స్టేషన్ వద్ద వేచి ఉన్న నార్సింగి పోలీస్ స్టేషన్ లో వాహనం దొంగతనం చేసిన కేసులోని పాత నేరస్థుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులందరిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అంజయ్య స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో వికారాబాద్ ఎస్హెచ్ఓ (ూఱ) రఘు కుమార్, క్యూఆర్టీ (ఉ=) బృందం, వికారాబాద్ క్రైమ్ టీమ్ మరియు బ్లూకోల్ట్స్ (బీసీ) సిబ్బంది, పోలీస్ స్టేషన్ ఇతర సిబ్బంది సంయుక్తంగా పాల్గొన్నారు.

# పట్టణ పేదలకు పెద్దన్న రేవంత్ రెడ్డి కానుకగా ఇందిరమ్మ ఇళ్లు



**హైదరాబాద్, మే 30:(సమయం న్యూస్) :** పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా, వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.బంజారాహిల్స్లో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి శనివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్లకు త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామని, ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మలి విడతలో మరో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు.గత ప్రభుత్వంలా పేదలను 30--40 కిలోమీటర్ల దూరంలో కాకుండా, ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్గా తీసుకుని అదే ప్రాంతంలో ఇళు నిర్మిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వ పథకాలు పేదవారి గుమ్మం వద్దకే చేరాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు.స్టాంపులు, రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖల సేవలను ఒకే చోట అందించేందుకు సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు. మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. బంజారాహిల్స్లో ఫీనిక్స్ సంస్థ 30 వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని నిర్మిస్తుందని తెలిపారు.ఈ భవనంలో ఎస్.ఆర్.నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్--గోల్కొండ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. స్థానిక ముస్లిం సోదరులు ఏటా రెండుసార్లు నమాజ్ నిర్వహించుకునేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని మంత్రి తెలిపారు.కార్యక్రమానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# 2030 వరకు పీఎం స్వనిధి పథకం పొడిగింపు

■ వీధి వ్యాపారులకు అండగా పీఎం స్వనిధి

**న్యూఢిల్లీ, మే 30: (సమయం న్యూస్)** దేశవ్యాప్తంగా వీధి వ్యాపారుల ఆర్థిక సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం స్వనిధి (ృవీ ూవాూచీఱఅస్త్రఱ) పథకాన్ని 2030 వరకు పొడిగించింది. ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు సులభ రుణాలు, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహం, సామాజిక భద్రతా ప్రయోజనాలు అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.పథకం అమలు ప్రారంభం నుంచి ఇప్పటివరకు 75.5 లక్షల మందికి పైగా వీధి వ్యాపారులకు 1.12 కోట్లకు పైగా రుణాల రూపంలో రూ.17,800 కోట్లకు మించి ఆర్థిక సహాయం అందించారు. దాదాపు 95 శాతం మంది లబ్ధిదారులు తొలిసారిగా బ్యాంకులు, ఆర్థిక సంస్థల ద్వారా అధికారిక రుణ సదుపాయం పొందారు.55 లక్షల మందికి పైగా వ్యాపారులు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో చేరి, 841 కోట్ల డిజిటల్ లావాదేవీలు నిర్వహించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.8.96 లక్షల కోట్లకు చేరుకుంది. పథకం లబ్ధిదారుల వార్షిక ఆదాయం సగటున 20 శాతం మేర పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.వీధి వ్యాపారుల జీవనోపాధి మెరుగుపడటంతో పాటు వారిని ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లడంలో పీఎం స్వనిధి పథకం కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# యూపీఎస్సీ ఫలితాలపై తప్పుదారి పట్టించే ప్రకటనలు

■ కోచింగ్ సంస్థకు రూ.7 లక్షల జరిమానా

**న్యూఢిల్లీ: మే3ర(సమయం న్యూస్) :** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల విషయంలో తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసిన ఒక కోచింగ్ సంస్థపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ రూ.7 లక్షల జరిమానా విధించింది.విజయం సాధించిన అభ్యర్థులు ఏ కోర్సులు చదివారు, సంస్థ నుంచి ఏ రకమైన సేవలు పొందారు అనే కీలక సమాచారాన్ని దాచిపెట్టి, వినియోగదారులను తప్పుదారి పట్టించినట్లు సీసీపీఏ గుర్తించింది.కోచింగ్ సేవలను ఎంచుకునే ముందు విద్యార్థులు, తల్లిదండ్రులకు పూర్తి, ఖచ్చితమైన సమాచారం తెలుసుకునే హక్కు ఉందని సీసీపీఏ స్పష్టం చేసింది. తప్పుడు విజయ ప్రచారాలు, అసంపూర్ణ ప్రకటనలు వినియోగదారుల హక్కుల ఉల్లంఘనగా పరిగణించబడతాయని హెచ్చరించింది.

# పోలీస్ శాఖలో అందించిన సేవలు అభినందనీయం

■ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

■ శేష జీవితం కుటుంబ సభ్యులతో హాయిగా గడపాలి.

■ రిటైర్డ్ అయిన పోలీసులకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది.



**నారాయణపేట, మే,30(సమయం న్యూస్) :** ధన్వాడ పోలీస్ స్టేషన్ లో (ఏ ఎస్సై) ఎం.ఏ సమద్ విధులు నిర్వర్తించి నేడు పదవి విరమణ పొందిన మరియు నర్వ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించిన కె ఆంజనేయులు శనివారం పదవి విరమణ పొందుతున్న సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ ఞూ పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి ఆయన వారికి స్వీట్స్ పంచారు. పోలీస్ శాఖకు చేసిన విశిష్ట సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...ఉద్యోగ నిర్వహణలో ప్రతి ఒక్కరికీ పదవి విరమణ తప్పనిసరి ప్రక్రియ అని పేర్కొంటూ, పీసీ స్థాయి నుంచి ఎస్సై వరకు అంకితభావంతో పోలీస్ శాఖకు సేవలందించిన ఏ ఎస్సై ఎం.ఏ సమద్ 1984 బ్యాచ్, (హెచ్ సి) కె ఆంజనేయులు 1992 బ్యాచ్ కి చెందిన వారి సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో వారు పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.పదవి విరమణ అనంతరం శేష జీవితం కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అలాగే పోలీస్ శాఖ నుండి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ను వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సూపర్డెంట్కు ఆదేశించారు. పదవి విరమణ అనంతరం ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ పూర్తి అండగా ఉంటుందని, అవసరమైతే నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు.ఈ సన్మాన కార్యక్రమంలో డీఎస్పీ మహేష్ ,సీఐ లు శివ శంకర్ , రామ్ లాల్, ఎస్సై లు నరేష్, రమేష్, వెంకటేష్ గౌడ్, పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పత్తి దిగుమతులపై కస్టమ్స్ సుంకాల మినహాయింపు

■ టెక్స్టైల్ పరిశ్రమకు ఊరట కల్పించనున్న కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 30( సమయం న్యూస్) :** దేశీయ వస్త్ర పరిశ్రమకు పత్తి లభ్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 జూన్ 1 నుంచి అక్టోబర్ 30 వరకు పత్తి దిగుమతులపై విధించే అన్ని కస్టమ్స్ సుంకాలను తాత్కాలికంగా మినహాయించింది.ఈ నిర్ణయంతో టెక్స్టైల్, దుస్తుల తయారీ రంగాల్లో ముడిసరుకు వ్యయం తగ్గి తయారీదారులకు ఉపశమనం లభించనుంది. అలాగే వినియోగదారులకు కూడా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. దేశీయ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ తాత్కాలిక మినహాయింపును అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.పత్తి దిగుమతులు సులభతరం కావడంతో మార్కెట్లో పత్తి అందుబాటు మెరుగుపడటంతో పాటు, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వస్త్ర పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) ఉత్పత్తి సామర్థ్యం పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.ఈ చర్య దేశీయ టెక్స్టైల్ పరిశ్రమ పనితీరును మెరుగుపరచడంతో పాటు, వస్త్ర ఉత్పత్తి రంగానికి మరింత ఊతమివ్వనుందని భావిస్తున్నారు.

# టి జే ఎఫ్ రజతోత్సవ ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

■ అల్లం నారాయణ

**హైదరాబాద్ మే30(సమయం న్యూస్) :** హైదరాబాద్: "తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు" అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ ముగింపు కార్యక్రమాన్ని మే 31 ఆదివారం హైదరాబాద్తో పాటు అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని టి జే ఎఫ్ అధ్యక్షులు అల్లం నారాయణ పిలుపునిచ్చారు.హైదరాబాద్లో గన్పార్క్ అమరుల స్థూపం వద్ద, జిల్లా కేంద్రాల్లో అమరవీరుల స్థూపాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి అమరుల త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. తెలంగాణ పునర్నిర్మాణంలో జర్నలిస్టులుగా మళ్లీ పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేయాలని సూచించారు.2001 మే 31న పది మందితో స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం కలం యోధులుగా ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నదని తెలిపారు. వేలాది మంది జర్నలిస్టులను ఏకం చేసి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టి జే ఎఫ్, భవిష్యత్తు లక్ష్యాలతో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అల్లం నారాయణ కోరారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ మే 30,(సమయం న్యూస్). :** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కెరమెరి మండలం కొరారి కొత్తగూడ గ్రామానికి జూన్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు లతో కలిసి ఏర్పాట్లతో పాటు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను చక్కగా అలంకరించాలని, గ్రామస్తులతో సహ పంక్తి భోజనంతో పాటు లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున సమావేశ వేదిక వద్ద పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ నుండి గ్రామంలో వచ్చే దారిలో స్వాగత తోరణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుధ్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ఘనంగా స్వాగతం పలికేలా అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటా తెలుగు మహాసభలకు కేటీఆర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్, మే 30(సమయం న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే టి రామారావు ను అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. 2026 జూలై 31, ఆగస్టు 1, 2 తేదీల్లో అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) తెలుగు మహాసభలకు హాజరుకావాలని ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఆటా అధ్యక్షుడు జయంత్ చల్ల ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల మహాసభల సందర్భంగా నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరించారు. అలాగే అమెరికాలో నివసిస్తున్న భారతీయుల పరిస్థితులు, అక్కడి రాజకీయ పరిణామాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో ఆటా కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి ,ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆటా తెలుగు మహాసభలకు హాజరయ్యేందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.

## సీబీఎస్ఈ మార్కుల గందరగోళంపై సమాధానం చెప్పాలి: కేటీఆర్



**హైదరాబాద్, మే 30(సమయం న్యూస్) :** సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదంపై పోరాడుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖ. ౧. ఞఖెు ఞశీ మద్దతు తెలిపారు. మార్కుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విద్యార్థులు, తల్లిదండ్రులు పారదర్శకత కోరే హక్కు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సీబీఎస్ఈ మార్కుల వివాదంలో కేంద్రంగా నిలిచిన గ్లోబరెనా సంస్థే 2019లో తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల గందరగోళానికి కారణమైన సంస్థ అని గుర్తుచేశారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సంస్థపై న్యాయపరమైన చర్యలు చేపట్టిందన్నారు. గత చరిత్ర ఉన్నప్పటికీ అదే సంస్థకు సీబీఎస్ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ఆశ్చర్యకరమని, నిబంధనలను సైతం సవరించి సంస్థకు అనుకూలంగా వ్యవహరించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన కేటీఆర్, విద్యార్థుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, తప్పిదాలను సరిదిద్ది, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

# మైనారిటీ విద్యార్థుల కోసం చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కీమ్ స్కాలర్‌షిప్ కింద ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

- జూన్ 01 06.2026 నుండి జూన్ 30.06.2026 వరకు దరఖాస్తు గడువు:M.A.రషీద్
- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నారాయణపేట



**నారాయణపేట,మే,30 (సమయం న్యూస్) :** జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ.రషీద్ ప్రెస్ నోట్ విడుదల చేస్తూ, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ నిర్వహించిన చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం (జమీూలా)ఫాల సీజన్ ( ాజూతీఅఅస్త్ర ామ్ఖంశీఅ) 2026 కింద, విదేశాలలో ఉన్నత విద్య (పోస్ట్ గ్రాడ్యుయేట్/పిహెచ్‌డి) చదువుతున్న మైనారిటీ విద్యార్థుల (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ) నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, యుకె, ఆస్ట్రియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్ మరియు న్యూజిలాండ్ వంటి విదేశీ దేశాల గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలలో (01.01.2026 నుండి 30.06.2026 వరకు) పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పిహెచ్‌డి అధ్యయనాలలో ప్రవేశం పొందిన మరియు ప్రభుత్వ అర్హత నియమాలన్నింటినీ నెరవేర్చిన అర్హతగల అభ్యర్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో (www.telangana epass. cgg.gov.in) సమర్పించవచ్చని ఆయన అన్నారు. అర్హులైన అభ్యర్థులు 30.06 2026 సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చని శంకరాచారి తెలిపారు. తరువాత, దరఖాస్తు హార్డ్ కాపీ మరియు అవసరమైన పత్రాలు/ధృవపత్రాలను 31-07-2026 సాయంత్రం 5.00 గంటలలోపు జిల్లా అధికారి, మైనారిటీ సంక్షేమ శాఖ, నారాయణపేటకు సమర్పించండి. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ. 20 లక్షలు మరియు రూ. 60,000 వన్-వే విమాన ఛార్జీ (లేదా వాస్తవ ఛార్జీ, ఏది తక్కువైతే అది) ఇవ్వబడుతుందని ఆయన చెప్పారు. పత్రాల పరిశీలన సమయంలో నకిలీ సర్టిఫికెట్లు ఉంటే అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వయస్సు, విద్యార్హత, వార్షిక ఆదాయం మరియు ఇతర ముఖ్యమైన వివరాలతో సహా పథకం యొక్క అన్ని వివరాల కోసం, వెబ్‌సైట్‌ను సందర్శించండి. నారాయణపేట లో అర్హులైన మైనారిటీ విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరియు పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారి ఎం.ఏ.రషీద్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి, (కలెక్టరేట్ కాంప్లెక్స్) ని సంప్రదించండి (ఎం.ఏ.రషీద్)జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, నారాయణపేట

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, మే,30(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందుజిల్లా కలెక్టర్ దీపక్ తివారి , రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటా చారితో కలిసి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పూర్తి ఏర్పాట్లు చేయాలనీ, జిల్లా అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలనీ సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున కాల్లెక్ట్రేట్ కార్యాలయ గ్రౌండ్ లో జాతీయ పతాకావిష్కరణలో భాగంగా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాల)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, వివిధ శాఖల అభివృద్ధి తెలిపే స్టాల్స్ ను ఏర్పాటు చేయాలనీ,అధికారులు ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని,బందోబస్తు,అమరవీరుల స్థూపం, స్టేజ్ అలంకరణ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి వాసు చంద్ర,కలెక్టరేట్ ఏవో ఫర్హీన బేగం,వివిధ శాఖల జిల్లా అధికారులు, డి ఎస్ పి వీరేశ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మే,30(సమయం న్యూస్) :** వికారాబాద్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ - స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ..విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిగమించవచ్చని దానికి విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ నుండే సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటరీ సమావేశాల్లో చర్చించే విషయాలపై కూడా అవగాహన కల్పించుకోవాలని ఆయన తెలిపారు. నూతనంగా వచ్చిన ఏఐ విధానంపై అవగాహన కల్పించుకుని సాంకేతికతను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అని మహాత్మా గాంధీ సూచించిన విషయాన్ని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో తమ లక్ష్యాన్ని ఎంచుకోవడంలో ఉన్నత అధికారుల సలహాలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో స్నేహ సంఘాల్లో సభ్యులుగా చేరాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికి జిల్లాలో 4500 స్నేహ సభ్యులుగా నమోదు చేసుకున్నారని, స్నేహ సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని, జిల్లా యంత్రాంగం తరపునుంచి తమ సహకారం కచ్చితంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మాక్ పార్లమెంటరీలో విద్య, ఆరోగ్యం, హోం శాఖలపై చర్చించడం జరిగింది. మా పార్లమెంటరీ లో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులుగా స్నేహ సంఘాల సభ్యులు మంచి పాత్రను పోషించారని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా నూతన అక్షరాస్యులుగా చదువు నేర్చుకున్న అభ్యాసకులకు, చదువు నేర్పిన వాలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ శ్రీనివాస్, అదనపు డీఆర్డీఏ నర్సింలు, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, వయోజన విద్య జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ బాబు, డీపీఎం నర్సింలు, కొమరయ్య, శేఖర్, నర్సింలు, జిల్లా మహిళా సమైఖ్య అధ్యక్షురాలు జానకీ, కార్యదర్శి శ్వేత, కోశాధికారి భాగ్యలక్ష్మి లతో పాటు స్నేహ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సై గా విధులు నిర్వహిస్తు,శనివారం పదవీ విరమణ పొందుతున్న నరేందర్ రెడ్డికి వీడ్కోలు సన్మాన కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా హాజరై, సత్కరించి ఘనంగా సన్మానించిన ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్







**వికారాబాద్, మే,30(సమయం న్యూస్) :** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని డిసిఆర్బి (ణజ=దీ) విభాగంలో సబ్-ఇన్స్పెక్టర్ (ఎస్సై) గా విధులు నిర్వహిస్తూ,శనివారం పదవీ విరమణ పొందుతున్న నరేందర్ రెడ్డికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఖూూ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందుతున్న నరేందర్ రెడ్డిని సత్కరించి, జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో కానిస్టేబుల్ (పిసి) గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి,ఎస్సై స్థాయి వరకు ఎదిగి, ఏకంగా సుమారు 42 సంవత్సరాల పాటు సుదీర్ఘమైన, నిష్కళంకమైన సేవలు అందించిన నరేందర్ రెడ్డిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ శాఖలో 42 ఏళ్ల పాటు సుదీర్ఘ సర్వీస్ పూర్తి చేయడం అనేది సామాన్యమైన విషయం కాదని, అది ఎంతో ఓర్పు, క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధత ఉంటేనే సాధ్యమవుతుందని కొనియాడారు. కానిస్టేబుల్ స్థాయి నుండి ఎస్సై వరకు ఆయన సాగించిన ప్రయాణం నేటి యువ పోలీస్ సిబ్బందికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నరేందర్ రెడ్డి తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా,ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలని ఎస్పీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో సంతోషకరమైన సమయాన్ని గడపాలని కోరారు. పోలీస్ శాఖకు ఆయన చేసిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని ఎస్పీ వివరించారు. ఎంతో ఆత్మీయంగా జరిగిన ఈ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీ జానయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా పోలీస్ ప్రసిడెంట్ ఆశోక్, డీపీఓ కార్యాలయ సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



శనివారం ఖమ్మం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ను సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రతిపా దనలు అందజేసి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ, అమలు పై చర్చించారు. ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యలను కలెక్టర్ కు ఎమ్మెల్యే వివరించారు.

# నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

- జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి
- మహిళా వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ లో మాక్ పార్లమెంట్ నిర్వహణ



**నిజామాబాద్, మే 30 (సమయం న్యూస్):** విద్యార్థి దశ నుండే బాలికలు నాయకత్వ లక్షణాలను పెంపొందిం చుకోవాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శనివారం కిశోర బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ సభా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా చట్ట సభలలో జరిగే సమావేశాల తీరును కళ్ళకు కట్టినట్లు ఆవిష్కరింపజేశారు. మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధి తదితర అంశాలపై ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన వారు ప్రశ్నలను లేవనెత్తగా, సంబంధిత శాఖల మంత్రుల పాత్రను పోషించిన బాలికలు సమాధానాలు తెలుపుతూ మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. దాదాపు రెండు గంటలకు పైగా మాక్ పార్లమెంట్ సెషన్ అద్యంతం ఎంతో ఆసక్తిగా కొనసాగింది. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల పాత్రలో బాలికలు ఎంతో చక్కగా ఇమిడిపోయి రాణించడం పట్ల కలెక్టర్ వారిని అభినందిస్తూ తన తరఫున పలువురికి ప్రత్యేక బహుమతులు అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సముచిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, తాము ఆశించిన దానికంటే ఎంతో ఉత్తమంగా బాలికలు రాణించి మాక్ పార్లమెంట్ ను విజయవంతం చేశారని ప్రశం సించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆత్మవిశ్వా సంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిణతిని ప్రదర్శిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌర విస్తూ, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని హితవు పలికారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలని, స్మార్ట్ ఫోన్లలో అనవసర విషయాలకు సమయం వృధా చేయకూడదని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యాల పరిరక్షణ కోసం తప్పని సరిగా పౌష్టిక ఆహారం తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే నిస్సంకోచంగా అధికారుల దృష్టికి తేవాలని, భద్రతా పరమైన సమస్యలు ఎదురైనప్పుడు భరోసా కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు. కాగా, తల్లిదండ్రులు పిల్లలను సమ దృష్టితో పెంచాలని, బాలికల పట్ల వివక్షను ప్రదర్శించకూడదని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కేరళంలో అక్షరాస్యత 90 శాతానికి పైగా ఉందని, అదే స్ఫూర్తితో తెలంగాణాలో కూడా అక్షరాస్యతను గణనీయంగా వృద్ధి చెందేలా ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము గమనించిన పలు సమస్యలు, ఇబ్బందుల గురించి బాలికలు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరపున తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, జిలా సంక్షేమ అధికారిణి పద్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వినియోగించాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి, మే 30(సమయం న్యూస్) :** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజా అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా వినియోగించి సామాజిక అభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. జిల్లాకు వివిధ పరిశ్రమల నుంచి వచ్చిన సీఎస్ఆర్ నిధులు, వాటి వినియోగం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్లు, వసతి గృహాలు, అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని పేర్కొన్నారు. సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు, పురోగతిపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవం కల్పించేందుకు కార్యాచరణ

- జూన్ 4న అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కమిటీ నిర్ణయం



**హైదరాబాద్, మే 30(సమయం న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ, అర్హుల జాబితా తయారీ తదితర అంశాలపై చర్చించారు. జూన్ 4న అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరినీ గుర్తించి సముచితంగా గౌరవించడం ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15న జి.ఓ.ఆర్.టి. నెం.679 జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల మేరకు కమిటీ తొలి సమావేశం నిర్వహించింది. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశల్లో క్షేత్రస్థాయిలో పాల్గొన్న వారి వివరాలను సేకరించి, పారదర్శకంగా అర్హుల జాబితా తయారు చేయాలని కమిటీ అధికారులను ఆదేశించింది. ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించిన వారు, పోలీసు కేసులు ఎదుర్కొన్న వారు, మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, విద్యార్థులు, ఆర్టీసీ కార్మికులు, సింగరేణి కార్మికులు తదితరులను గుర్తించి గౌరవించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు తగిన గుర్తింపు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కమిటీని ఏర్పాటు చేశారని మంత్రి పేర్కొన్నారు. సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా, ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించి

- వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించుకున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఐఏఎస్.




**వికారాబాద్, మే,30(సమయం న్యూస్):** జిల్లాలో కల్లెక్టరేట్ కార్యాలయంలో శంకర కంటి ఆసుపత్రి నానక్ రామ్ గూడా హైదరాబాద్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి శిబిరం నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా కంటి పరీక్ష చేయించుకుని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు నిర్దిష్ట వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు తదుపరి చికిత్సలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి పవిత్ర, ఏ ఓ పర్వీన బేగం వైద్యులు, సిబ్బంది మరియు పాల్గొన్నారు.

# యాలాల మండల కేంద్రంలో నూతన తహేసిల్దార్ కు సన్మానం



**యాలాల మండలం, మే,30(సమయం న్యూస్):** తాండూర్ నియోజక వర్గం యాలాల మండల కేంద్రంలో తాహసిల్దార్ కార్యాలయంలో నూతన తహేసిల్దార్ గాయత్రి ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన గ్రామ సర్పంచ్ సీ. హెచ్ శివయ్య, ఉపసర్పంచ్ మల్కిరెడ్డి శోభారాజు రెడ్డి, వికారాబాద్ జిల్లా మాజీ కో -అప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ, 12వ వార్డ్ నెంబర్ బోయి ఉమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి గొల్ల చందు, బుర్ణపూరి నర్సిములు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు

# రహదారి ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి

- 'రహదారి వీరుల' పథకంపై కలెక్టర్ సమీక్ష



**కామారెడ్డి, మే 30(సమయం న్యూస్) :** రహదారి ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహదారి వీరుల' (రహవీర్) పథకాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పథకం అమలుపై ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులకు సహాయం చేయాలని, ప్రతి ఒక్కరూ 'రహదారి వీరులు'గా మారాలని పిలుపునిచ్చారు. ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం తరఫున రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. పథకం అమలును పారదర్శకంగా పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో 'డిస్ట్రిక్ట్ అప్రిసియేషన్ కమిటీ'ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరించగా, జిల్లా పోలీసు సూపరింటెండెంట్, జిల్లా రవాణా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు బాధితులకు తక్షణ వైద్యం అందేలా ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



జిల్లా నూతన వైద్య అధికారిగా
డాక్టర్. లలితా దేవి బాధ్యతలు స్వీకరించడం జరిగింది
జిల్లా కలెక్టర్ గారికి మర్యాదపూర్వకంగా కాలవడం జరిగింది

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి..

- అడిషనల్ కలెక్టర్ నాగేష్



**మెదక్ మే30 (సమయం న్యూస్) :** వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి, లేబర్ హమాలీలను పెంచాలని అడిషనల్ కలెక్టర్ నాగేష్ అధికారులను ఆదేశించారు.

శనివారం చిలిపిచేడ్ మండలంలోని గౌతపూర్ గ్రామ శివారులో దక్కన్ ఆగ్రో రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోదాంను సందర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ నాగేష్ కలెక్టర్ మాట్లాడుతూ.. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని నర్సాపూర్ లో రెండు గోదాములకు పంపిస్తామని, మిగతావన్నీ ఆగ్రో దక్కన్ గోదాం లోనే ధాన్యం బస్తాలను ఖాళీ ఇచ్చేస్తామన్నారు. లేబర్ ను పెంచి తొందరగా లారీ లో ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్ లో ఉన్న ధాన్యాన్ని దించుకోవాలని ఇన్చార్జ్ తాహాసిల్దార్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసిల్దార్ జహీర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్: తలసాని

- ముషీరాబాద్ బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శలు



**హైదరాబాద్, మే 30(సమయం న్యూస్):** ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ చరిత్ర అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శనివారం కాశిష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో మహిళలకు నెలకు రూ. 2,500, లక్ష ఉద్యోగాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలుకాలేదని తలసాని ఆరోపించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి అనుచిత భాషలో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే తగిన విధంగా ప్రశ్నించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలన తెలంగాణకు స్వర్ణయుగమని తలసాని అభివర్ణించారు. రూ. 200 ఉన్న పింఛన్‌ను రూ. 2,000కు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో, మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరం విస్తృతంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు అయినా నిర్మించిందా అని ప్రశ్నించారు. ప్రజలకు కనీసం తాగునీరు అందించలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. కేసీఆర్ పాలనలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేవని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. పేరుకు ప్రజాపాలన అని చెప్పుకుంటూ, వాస్తవానికి దోపిడీ పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

## న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్



**హైదరాబాద్ మే30(సమయం న్యూస్) :** మాసాబ్ ట్యాంక్‌లో ఇటీవల దారుణ హత్యకు గురైన ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ నివాసాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు సందర్శించారు. మొయినుద్దీన్ అకాల మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడే న్యాయవాదిని ఇలా దారుణంగా హత్య చేయడం అత్యంత విచారకరమని ఖండించారు. ఈ ఘటనపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి, కేసును వేగంగా విచారించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని కేటీఆర్ అన్నారు. ఖాజా మొయినుద్దీన్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరామర్శలో ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్, తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- జూన్ 2 నాటికి ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**అశ్వారావు పేట మే30(సమయం న్యూస్):** అశ్వారావుపేట పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు, తహసీల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల నాణ్యత, పురోగతి, భవనాల నమూనా మ్యాపులను పరిశీలించారు. విద్యార్థులకు భవిష్యత్తులో అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించేలా అన్ని ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాల ప్రాంగణానికి అనుసంధాన రహదారులు, అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి విద్యను అందించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే లక్ష్యంతో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి, సాదా బైనామా, భూ సర్వేలకు సంబంధించిన దరఖాస్తులు, వాటి పరిష్కార పురోగతిని తహసీల్దార్ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించి సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. అలాగే అశ్వారావుపేట మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలు, ఫిర్యాదులను తెలుసుకు న్నారు. ప్రజల వినతులను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అం దించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు . అశ్వారా వుపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. అశ్వారావుపేట మండలంలో మొత్తం 957 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 926 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అధికారులు వివరించారు. వీటిలో 123 ఇండ్లు బేస్ లెవల్‌లో, 189 ఇండ్లు రూఫ్ లెవల్‌లో, 403 ఇండ్లలో స్లాబ్ పనులు పూర్తికాగా, 200 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా 31 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 136 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 129 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమై, 52 ఇండ్లు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పూర్తయిన మరియు చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జూన్ 2వ తేదీన గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాని ఇండ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందిస్తూ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశిం చారు. ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే ందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న విద్యా, గృహ నిర్మాణ, రెవెన్యూ సేవల కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కిషోర్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ మదన్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

- ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల బలోపేతానికి సమగ్ర చర్యలు
- విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి, మే 30(సమయం న్యూస్):** రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మైనర్, మేజర్ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, పాఠశాల భవనాలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలను విద్యార్థులు చూసిన వెంటనే చదువుపై ఆసక్తి పెరిగేలా, పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలురు, బాలికల వసతి గృహాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం ప్రారంభానికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థలు, వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తున్నందున సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సంగీత, పాండు , సంబంధిత శాఖల అధికారులు, ఆర్‌సీవోలు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, టి జి ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

## కలెక్టర్ హేమావతి



**సిద్దిపేట, మే 30(సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 2న జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొత్తం కార్యక్రమాన్ని సిద్దిపేట ఆర్డీవో పర్యవేక్షిస్తారని చెప్పారు. స్టేజ్ డెకరేషన్, గ్రౌండ్ మ-ంస్తాబు తెలంగాణ ఆవిర్భావ వేడుకల స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఉండాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, వ్యవసాయం, ఉద్యానవనం, పౌరసరఫరాలు, సోలార్ పవర్, జనగణన--2027, ప్రత్యేక ఓటరు నమోదు తదితర శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్య అతిథి ప్రసంగ ప్రతులను ముందుగానే సిద్ధం చేయాలని, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, నిరంతర విద్యుత్ సంఫరా, తాగునీరు, సీటింగ్ వంటి ఏర్పాట్లు సమకూర్చాలని ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అవసరమైన మందులతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమానికి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అతిథులకు ముందస్తుగా ఆహ్వానాలు పంపించాలని తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, డీఆర్వో నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ● ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



**పరిగి మున్సిపల్, (మం)మే,30(సమయం న్యూస్):** పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా శక్తి వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 42 స్వయం సహాయక సంఘాలకు రూ.4 కోట్ల 20 లక్షల బ్యాంకు లింకేజ్ అందజేశారు. అలాగే మహిళలకు ఇందిరమ్మ చీరలను స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్తమంగా పనిచేసిన ఐదు చూాఖీలకు సన్మానం చేశారు. అవి

1. నస్కల్-1 ALF,
2. నస్కల్-2 ALF,
3. పరిగి-1 ALF,
4. పరిగి-2 ALF,
5. నజీరబాద్ ALF,

అదేవిధంగా ఉల్లాస్ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళల ఆర్థికాభివృద్ధి,సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని,స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతోందని, ఈ పథకం వల్ల మహిళలందరూ సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇంది రమ్మ ఇళ్లను కూడా మహిళల పేర్లపైనే మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పరిగి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం జరిగిందని, తాజాగా మరో 2000 ఇళ్లను మహిళల పేర్లపై మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులను అందజేయడం జరుగుతోందని,ప్రతి లబ్ధిదారునికి నెలకు 6 కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే పథకాన్ని జూన్ 2వ తేదీ నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

# బాల్య వివాహా రహిత జిల్లాగా మార్చుదాం

## - జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.





**నారాయణపేట, మే 30(సమయం న్యూస్):** నారాయణ పేటను బాల్య వివాహా రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. బాలికల చదువుతోనే బాల్య వివాహాలను నిర్మూలించడం సాధ్యం అవుతుందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వయోజన విద్య అమ్మకు అక్షర మాల, స్నేహ సంఘాల ద్వారా మాక్ పార్ల మెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి కలెక్టర్ హజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సారి పది ఫలితాలలో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు అమ్మాయిలే కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఎప్పుడూ పది ఫలితాల్లో బాలికలదే హావా అని చూస్తుంటాం కానీ ఉద్యోగాలలో మాత్రం బాలికలు వెనకబడిపోతారని, పదో తరగతి తర్వాత ఆరేళ్ల లో బాలికలు తీసుకునే నిర్ణయాలతో భవిష్యత్తును మార్చుకోవద్దని తెలిపారు. రేపు జరగబోయే దాని గురించి ఈ రోజు ఆలోచించ వద్దన్నారు. అమ్మకు అక్షర మాల ద్వారా వయోజనులకు చదువు చెప్పే వీ వో లకు ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత పెరగాలని ఆమె సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. జిల్లా లో బాల్య వివాహాల నిర్మూలన కు మిషన్ మోడ్ లో పనిచేయాలన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి సహకారం ఉంటుందని చెప్పారు. బాలికలు తమ కోసం తాము ఫైట్ చేయాలని, తమ తోటి స్నేహితురాలి కోసం కూడా ఫైట్ చేయాలన్నారు. మహిళలు చదువుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. కాగా అంతకు ముందు బాల్య వివాహాల నిరోధక చట్టం పై మాక్ పార్ల మెంట్ నిర్వహించిన కిశోర బాలికలను జిల్లా కలెక్టర్,ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధుల నిర్వహణ లో ఉత్తమ ప్రతిభ చాటిన సి సి లు, సిబ్బందికి కలెక్టర్, ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ వెంకట్ రాములు, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, డీ ఈ ఓ గోవింద రాజులు, డీ పీఎం, ఏ పీ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ లో ఆర్టిసి ప్రత్యేక సమ్మర్ డిస్కౌంట్ ఆఫర్ ముగిసిందని

**హైదరాబాద్ మే30(సమయం న్యూస్):** వేసవి కాలంలో ప్రయాణికులకు ఉపశమనం కలిగించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రవేశపెట్టిన ప్రత్యేక సమ్మర్ డిస్కౌంట్ ఆఫర్ ముగిసిందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (౧+ూ=ుజ) ప్రకటించింది. మూడు నెలల (మార్చి, ఏప్రిల్, మే ) పాటు ఇచ్చిన రాయితీ గడువు ముగియడంతో, జూన్ 1 నుండి మెట్రో డీలక్స్ మరియు ఏసీ బస్సుల్లో పాత చార్జీలను యథావిధిగా పునరుద్ధరిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. అయితే ఈ మార్పుపై ప్రయాణికుల్లో ఎలాంటి గందరగోళం లేకుండా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఒక ముఖ్యమైన స్పష్టతనిచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో కొత్తగా ఎలాంటి ఛార్జీలను పెంచలేదని, కేవలం వేసవి కాలం కోసం ప్రత్యేకంగా అందించిన సమ్మర్ డిస్కౌంట్ గడువు మాత్రమే ముగిసిందని పేర్కొంది. కాబట్టి ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సంస్థకు సహకరించాలని అధికారులు కోరారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా సామాన్య ప్రయాణికులకు సుఖవంతమైన, ఏసీ ప్రయాణాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశ్యంతో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి గారి ఆదేశాల మేరకు ఈ సమ్మర్ ఆఫర్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మెట్రో డీలక్స్ మరియు ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి మార్చి 2026 నుండి మే 31, 2026 వరకు ఈ రాయితీలు అందుబాటులో ఉన్నాయి. మూడు నెలల పాటు కొనసాగిన సాగిన ఈ ఆఫర్ గడువు ముగియడంతో జూన్ మొదటి తేదీ నుండి రాయితీకి ముందు ఉన్న పాత టికెట్ ధరలే అమలులోకి వస్తాయి. తీవ్ర వేసవి దృష్ట్యా సామాన్య ప్రయాణికులకు సౌకర్యవంతమైన ఏసీ ప్రయాణాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశ్యంతో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సమ్మర్ ఆఫర్‌ను నిర్వహించడం జరిగింది. ఈ మూడు నెలల పాటు ఆఫర్‌ను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి సహకరించిన ప్రయాణికులకు సంస్థ యాజమాన్యం ధన్యవాదాలు తెలియజేసింది.

# భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



## కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ మే30(సమయం న్యూస్) :** మెదక్ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) జోనల్ మేనేజర్ మధు, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రావతి, మేనేజర్ శ్రీవాణి, జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) అసిస్టెంట్ డైరెక్టర్ సంగీతతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులతో పాటు టీజీఐఐసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

**ఇప్పటికే 40 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి , కేంద్రాల మూసివేత**

**47,436 మంది రైతులకు 512,87 కోట్ల రూపాయలు చెల్లింపు**

**---జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ మే30(సమయం న్యూస్) :** జిల్లాలో ధాన్యం కొనుగోళు ముమ్మరంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 64,493 మంది రైతుల నుంచి 3,05,018.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అందులో 47, 463 రైతులకు 512,87 కోట్ల రూపాయలను వారి అకౌంట్లో జమ చేశామని తెలిపారు. రైతులు అధైర్య పడవద్దని , ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు జిల్లాలో 40 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు పూర్తయింది , వాటిని మూసివేయడం జరిగిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# నిరుద్యోగి యూత్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం, మోటివేశనల్ క్యాంప్

## ● జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ.



**వికారాబాద్, మే 30(సమయం న్యూస్):** ఇంటిగ్రాటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ప్లేన్ ఏరియా క్రింద నిరుద్యోగి యూత్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మరియు, మోటివేషనల్ క్యాంప్ మన కుల్కచర్ల మండలం లో ఎంపీడీఓ ఆఫీస్ యందు తేదీ (04.06.2026) నాడు సమయము ఉ:10.30 జరుగుతుంది. ఇట్టి ప్రోగ్రాం ఆరు స్కిల్ ట్రైనింగ్ ఏజెన్సీల ద్వారా జరుగుతుంది

1. అగ్రికల్చర్ ఫైనాన్షియల్ కార్పొరేషన్(AFC) ఇండియా లిమిటెడ్.
2. అపారల్ మాడ్ అప్స్ అండ్ హోమ్ ఫర్నిషింగ్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ (AMHSSC)
3. అగ్రికల్చర్ స్కేల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ASCI)
4. బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ లిమిటెడ్ (B&WSSC).
5. NI-MSME
6. టూరిజం అండ్ హాస్పిటలిటీ స్కిల్ కౌన్సిల్ (THSC).

ఇట్టి కార్యక్రమం లో ST యూత్ అందరు హాజరు కాగలరు మరియు ఇట్టి కార్యక్రమానికి దిగ్విజయం చేయగలరని విన్నపం. సమయం ఉ :10:30 గంటలకు జిల్లా గిరిజన శాఖ అభివృద్ధి అధికారి.

వికారాబాద్ జిల్లా

# మహిళ వారోత్సవాలలో భాగంగా "అమ్మ మాట -అంగన్వాడీ బాట" కార్యక్రమం



## ● ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక

**మరికల్ మండలం, మే,30(సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో "అమ్మ మాట -- అంగన్వాడీ బాట" కార్యక్రమాన్ని శనివారం నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని 704 అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదైన చిన్నారులకు నూతన దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. అలాగే మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల ప్రీ-స్కూల్ విభాగంలో కొత్తగా నమోదు (ఎన్‌రోల్‌మెంట్) చేయడం జరిగింది అలాగే పిల్లలకు విద్యారంభ సర్టిఫికెట్లను పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా, జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రపరచి, కేంద్రాల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్, సర్పంచ్ మరికల్ మండలం అప్పంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు నూతన దుస్తులు, పలకలు పంపిణీ చేశారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్, ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్ లు,సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,తహసీల్దార్ రాంకోటి, ఎంఈఓ మరికల్, గ్రామ పెద్దలు, మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**నిర్మల్ మే30(సమయం న్యూస్):** కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# పొగాకు రహిత సమాజనికి యువత కృషి చేయాలి

**కరీంనగర్ మే30(సమయం న్యూస్):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ముందస్తు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రాణి గారి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి పాల్గొని శిక్షణ పొందుతున్న యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ధూమపానం చేసే వారితో పాటు వారి చుట్టుపక్కల ఉన్నవారు కూడా ప్యాసివ్ స్మోకింగ్ వల్ల ప్రమాదానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కోట్పా (జ్రూూా) చట్టం -- 2003 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం, విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయం నేరమని వివరించారు. యువత తమ ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ డా. యం. రవికుమార్, రిసోర్స్ పర్సన్ లు ఏ. సంతోష్ కుమార్, గజ్జెల అశోక్ పాల్గొన్నారు. అనంతరం పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని పాల్గొన్న యువత ప్రతిజ్ఞ చేశారు.

# ఆసియా క్రీడల ప్రాథమిక జాబితా రెడీ

## వైభవ్‌కు చోటు.. సూర్యకు షాక్!

**న్యూఢిల్లీ :** జపాన్‌లోని ఐచీ-నగోయాలో జరగనున్న ఆసియా క్రీడలను లక్ష్యంగా పెట్టుకుని భారత క్రికెట్ నియంత్రణ మండలి 30 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాథమిక జాబితాను సిద్ధం చేసింది. భారత ఒలింపిక్ సంఘానికి పంపిన ఈ జాబితాలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కగా, ప్రముఖ ఆటగాళ్లు సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ పేర్లు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. అదే సమయంలో వెస్టిండీస్‌తో భారత్ వన్డే, టీ20 సిరీస్ ఆడాల్సి ఉండటంతో రెండు వేర్వేరు జట్లను ఎంపిక చేయాలని బీసీసీఐ భావిస్తోంది. వెస్టిండీస్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ కీలక బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఆయనను ఆసియా క్రీడల జాబితాలో చేర్చలేదని తెలుస్తోంది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు కూడా ఈ జాబితాలో స్థానం దక్కకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. భవిష్యత్తు టోర్నీలను దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. ఆసియా క్రీడల జట్టుకు శ్రేయస్ అయ్యర్, సంజూ శాంసన్ లేదా తిలక్ వర్మలలో ఒకరు నాయకత్వం వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు జాబితాలో చోటు దక్కినప్పటికీ, ఆయన వెస్టిండీస్ సిరీస్‌లో ఆడే అవకాశమే ఎక్కువగా ఉందని






తెలుస్తోంది. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా వంటి బౌలర్లతో పాటు కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హర్ష్ దూబే వంటి స్పిన్నర్లకు కూడా ప్రాధాన్యం లభించింది. ప్రాథమిక జాబితాలో యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, అనుకుల్ రాయ్, ఆయుష్ బదోని, హర్ష్ దూబే, ధ్రువ్ జురెల్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, షాబాజ్ అహ్మద్, శివం దూబే, విప్రజ్ నిగమ్, హర్షిత్ రాణా, యశ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు. ఆసియా క్రీడల్లో మరోసారి పసిడి పతకాన్ని గెలుచుకోవడమే లక్ష్యంగా బీసీసీఐ యువ ఆటగాళ్లపై దృష్టి సారించినట్లు ఈ జాబితా స్పష్టం చేస్తోంది.



# ఆసియా క్రీడల ట్రయల్స్‌లో అదరగొట్టిన వినేశ్..

## తొలి బౌట్‌లో ఘన విజయం..!

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల కోసం నిర్వహిస్తున్న ఎంపికల ట్రయల్స్‌లో ప్రముఖ రెజ్లర్ వినేశ్ పోగట్ శుభారంభం చేసింది. ప్రారంభ బౌట్‌లో జ్యోతిపై 7-1 స్కోరు తేడాతో విజయం సాధించి తన సత్తా చాటింది. మ్యాచ్ ఆరంభంలో కొంత జాగ్రత్తగా ఆడిన వినేశ్, ఆ తర్వాత దూకుడు పెంచి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి పీరియడ్‌లో పుష్ పాయింట్‌తో ఖాతా తెరిచిన వినేశ్, అనంతరం డబుల్ లెగ్ అటాక్‌తో మరిన్ని పాయింట్లు సాధించింది. ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా రక్షణాత్మకంగానూ, దూకుడుగానూ ఆడి ఆధిక్యంలో నిలిచింది. రెండో పీరియడ్‌లో వినేశ్ పూర్తిగా మ్యాచ్‌ను తన నియంత్రణలోకి తీసుకుంది. రైట్ లెగ్ అటాక్‌లతో వరుస పాయింట్లు సాధిస్తూ 3-0 ఆధిక్యం సంపాదించింది. జ్యోతి కూడా లెగ్ అటాక్‌కు ప్రయత్నించినప్పటికీ, ఆ పోరులో వినేశ్ పైచేయి సాధించింది. కౌంటర్ అటాక్‌లో వరుసగా రెండు వేగవంతమైన కదలికలతో స్కోరును 7-0కు చేర్చింది. చివర్లో జ్యోతి ఒక పుష్ ఔట్ పాయింట్ సాధించినప్పటికీ ఫలితాన్ని మార్చలేకపోయింది. ఈ విజయంతో వినేశ్ పోగట్ తదుపరి బౌట్‌లో నిషాతో తలపడనుంది. ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశంపై గతంలో వివాదం నెలకొన్నప్పటికీ, న్యాయపరమైన పోరాటం అనంతరం అవకాశం దక్కించుకున్న వినేశ్ ఇప్పుడు తన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆసియా క్రీడల బెర్త్ కోసం ఆమె పోరాటం ఆసక్తికరంగా మారింది.

# ఆరెంజ్ క్యాప్ కోసం త్రిముఖ పోరు

## వైభవ్‌కు గిల్, సుదర్శన్ సవాల్!

**అహ్మదాబాద్ :** ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకోగా ఆరెంజ్ క్యాప్ విజేత ఎవరు అన్న ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 776 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ, గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ అతడికి గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. లీగ్ దశలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై శతకం సాధించిన అతడు, ఎలిమినేటర్‌లో 97 పరుగులు, క్వాలిఫయర్-2లో 96 పరుగులతో మెరిశాడు. మొత్తం 776 పరుగులతో ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ క్వాలిఫయర్-2లో సెంచరీతో చెలరేగి తన మొత్తం పరుగులను 722కు చేర్చుకున్నాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ కూడా అర్ధశతకంతో 710 పరుగులకు చేరుకుని రేసులో నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు బ్యాటర్లు 700కు పైగా పరుగులు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. రాజస్థాన్ రాయల్స్ టోర్నీ నుంచి నిష్క్రమించడంతో వైభవ్ ఖాతాలో ఇక పరుగులు చేరే అవకాశం లేదు. అయితే ఫైనల్లో ఆర్సీబీతో జరిగే మ్యాచ్‌లో గిల్ లేదా సుదర్శన్‌లో ఎవరో ఒకరు భారీ ఇన్నింగ్స్ ఆడితే వైభవ్‌ను అధిగమించే అవకాశం



ఉంది. దీంతో ఫైనల్ మ్యాచ్ ఆరెంజ్ క్యాప్ విజేతను కూడా నిర్ణయించనుంది. ఇప్పటికే శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ చెరోసారి ఆరెంజ్ క్యాప్ గెలిచారు. 2023లో గిల్ అత్యధిక పరుగులతో విజేతగా నిలవగా, 2025లో సాయి సుదర్శన్ ఆ ఘనత సాధించాడు. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ టైటిల్ కోసం పోటీ పడుతున్నారు. అయితే ఫైనల్లో ఆర్సీబీ పేసర్లు భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ ధాటికి గుజరాత్ ఓపెనర్లు తక్కువ స్కోరుకే పరిమితమైతే, వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకునే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం క్రికెట్ అభిమానుల చూపంతా ఫైనల్‌తో పాటు ఆరెంజ్ క్యాప్ పోరుపైనే ఉంది.

# పరాగ్ వ్యాఖ్యలతో ఏకీభవించని సంగక్కర

## రాజస్థాన్ రాయల్స్‌లో ఆసక్తికర చర్చకు తెర

**అహ్మదాబాద్:** ఐపీఎల్-2026లో రాజస్థాన్ రాయల్స్ ప్రయాణం ముగిసిన అనంతరం జట్టులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కెప్టెన్ రియాన్ పరాగ్ చేసిన వ్యాఖ్యలతో హెడ్ కోచ్ కుమార్ సంగక్కర బహిరంగంగానే విభేదించడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. క్వాలిఫయర్-2 మ్యాచ్ అనంతరం ఇద్దరూ జట్టు లక్ష్యాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన రియాన్ పరాగ్ తమ జట్టులో ఎక్కువ మంది యువ ఆటగాళ్లు, అనుభవం తక్కువ ఉన్న క్రికెటర్లు ఉండటంతో ప్లేఆఫ్స్‌కు చేరుకోవడం కూడా పెద్ద విజయమేనని వ్యాఖ్యానించాడు. సీజన్ ఆరంభంలో రాజస్థాన్ టాప్-4లో నిలుస్తుందని చాలా మంది ఊహించలేదని పేర్కొన్నాడు. అయితే ఈ వ్యాఖ్యలపై స్పందించిన సంగక్కర మాత్రం భిన్నంగా స్పందించాడు. రాజస్థాన్ రాయల్స్ ఎప్పుడూ కేవలం ప్లేఆఫ్స్‌కు చేరడానికే ఆడదని, టైటిల్ గెలవడమే తమ అసలు లక్ష్యమని స్పష్టం చేశాడు. జట్టులోకి ఎంపిక చేసే ప్రతి ఆటగాడిని మ్యాచ్ విజేతగానే భావిస్తామని, అనుభవం కంటే సామర్థ్యానికే ప్రాధాన్యం ఇస్తామని తెలిపాడు. వ్యాఖ్యల విషయంలో విభేదించినప్పటికీ కెప్టెన్‌గా పరాగ్ పనితీరును సంగక్కర ప్రశంసించాడు. పూర్తి స్థాయి నాయకుడిగా తొలి సీజన్‌లోనే పరాగ్ మంచి నిర్ణయాలు తీసుకున్నాడని, మైదానంలో నాయకత్వ లక్షణాలు కనబరిచాడని పేర్కొన్నాడు. భవిష్యత్తులో మరింత సమర్థ కెప్టెన్‌గా ఎదుగుతాడనే విశ్వాసం వ్యక్తం చేశాడు. టోర్నీ ప్రారంభానికి ముందు రాజస్థాన్ అవకాశాలపై అనేక సందేహాలు వ్యక్తమైనప్పటికీ జట్టు ప్లేఆఫ్స్ వరకు చేరి విమర్శకులకు సమాధానం ఇచ్చిందని సంగక్కర పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో ఎదురైన అనుభవాలను పాఠాలుగా తీసుకుని వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి రావడమే తమ లక్ష్యమని వెల్లడించాడు.




# వైభవ్ బ్యాటింగ్ అసాధారణం.. సీనియర్లకూ అసాధ్యం

## సర్ఫరాజ్ ఖాన్

**ముంబై :** రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. చిన్న వయసులోనే వైభవ్ ప్రదర్శిస్తున్న ఆత్మవిశ్వాసం, భారీ షాట్లు ఆడే సామర్థ్యం అసాధారణమని కొనియాడాడు. వైభవ్ హిట్టింగ్ పవర్ గురించి మాట్లాడుతూ, ఎంతో అనుభవం ఉన్న సీనియర్ క్రికెటర్లు కూడా బంతిని అతడు కొట్టినంత సమర్థంగా బాదలేరని సర్ఫరాజ్ పేర్కొన్నాడు. క్రీజులో నిలబడి బంతిని టైమ్ చేసే తీరు, సరైన షాట్ల ఎంపిక అతడి ప్రత్యేకత అని అన్నాడు. అంత చిన్న వయసులోనే ఇంతటి పరిణతి ప్రదర్శించడం సాధారణ విషయం కాదని సర్ఫరాజ్ అభిప్రాయపడ్డాడు. ప్రతి మ్యాచ్‌లోనూ భయం లేకుండా దూకుడుగా ఆడుతూ జట్టుకు కీలక పరుగులు అందిస్తున్నాడని తెలిపాడు. ఐపీఎల్ వేలంలో భారీ ధరకు ఎంపికైనప్పటి నుంచే వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ప్రస్తుతం అతని ప్రదర్శనలు రాజస్థాన్ రాయల్స్‌కు కీలక బలంగా మారాయి. సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్రముఖ ఆటగాడి నుంచి వచ్చిన ప్రశంసలు యువ బ్యాటర్‌కు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. భారత క్రికెట్‌కు వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే సామర్థ్యం అతనిలో కనిపిస్తోందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఐపీఎల్‌లో అరుదైన ఘనత

## వరుసగా రెండుసార్లు హిట్ వికెట్‌గా సాయిసుదర్శన్

**చండీఘడ్:** ఐపీఎల్-2026 సీజన్‌లో రెండుసార్లు సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. వరుస రెండు మ్యాచుల్లో ఇది జరిగింది. బెంగుళూరు, గుజరాత్‌లతో జరిగిన మ్యచ్‌లలో సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. ఇకపోతే క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ మరోసారి సత్తాచాటింది. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని 3 వికెట్లు కోల్పోయి ఛేదించి, బెంగళూరుతో తుదిపోరుకు అర్హత సాధించింది. అయితే.. ఈ మ్యాచ్‌లో జీటీ ఓపెనర్ సాయి సుదర్శన్ ఔటైన తీరే చర్చనీయాంశమవుతోంది. బ్రిజేష్ శర్మ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ వైపు బౌండరీ కొట్టిన అనంతరం అతడి చేతిలోని బ్యాట్ జారి నేరుగా వికెట్లను తాకడంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు క్వాలిఫయర్-1లో జరిగిన మ్యాచ్‌లోనూ ఆర్సీబీపై ఇదే తరహాలో ఔటయ్యాడు. దీంతో ఐపీఎల్‌లో వరుసగా 2 ఇన్నింగ్స్‌ల్లో హిట్ వికెట్‌గా వెనుదిరిగిన తొలి బ్యాటర్‌గా కోరుకుని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు సాయి సుదర్శన్. మ్యాచ్ అనంతరం తాను ఔటైన తీరుపై సాయి సుదర్శన్‌కు ఓ ప్రశ్నకు అతడు సరదాగా స్పందించాడు. 'ఇకపై బ్యాట్ చేతికి అతుక్కుని ఉండేలా గ్రిప్ టెక్నిక్‌లు ఏవైనా ఉన్నాయేమో ప్రయత్నించాలి' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన సాయి సుదర్శన్.. తొలి వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్




చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధికం. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మైక్ హస్సీ, మురళీ విజయ్ 159 పరుగులు జోడించగా.. ఆ రికార్డును వీరు అధిగమించారు. అంతేకాకుండా గిల్-సుదర్శన్ జోడీ మరో ఘనతనూ సొంతం చేసుకుంది. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధికంగా 100కు పైగా భాగస్వామ్యాలు నెలకొల్పిన జోడీగా అవతరించింది. వీరిరువురూ 11 సెంచరీ భాగస్వామ్యాలతో.. క్రిస్ గేల్-కోహ్లీ, బాబర్ ఆజమ్-మహ్మద్ రిజ్వాన్, డివిలియర్స్-కోహ్లీ జోడీలను వెనక్కి నెట్టారు. క మ్యాచ్ విషయానికొస్తే.. 215 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గిల్(53 బంతుల్లో 104) అద్భుత శతకంతో మెరిశాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులతో చెలరేగాడు. వీరి దూకుడుకు రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. జీటీ చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్ఆర్ 20 ఓవర్లలో 214/6 పరుగులు చేసింది. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 47 బంతుల్లో 96 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆకట్టుకోగా.. రవీంద్ర జడేజా 45 పరుగులతో రాణించాడు.

# వారణాసి స్టిల్స్ లీక్.. జక్కన్న మౌనం

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు.







# అజిత్ కుమార్‌కు మాతృవియోగం

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడు అజిత్ కుమార్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి మోహిని మణి శనివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోసంబంధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. 84 ఏళ్ల మోహిని మణి మరణవార్త తెలిసిన వెంటనే తమిళ సినీ వర్గాలు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో అజిత్ కుమార్‌తో పాటు అనూప్ కుమార్, అనిల్ కుమార్ కూడా ఉన్నారు. కుటుంబ సభ్యులతో ఎంతో ఆప్యాయంగా ఉండే మోహిని మణి మరణం వారి కుటుంబానికి తీరని లోటుగా మారింది. 2023లో అజిత్ తండ్రి పి.ఎస్. మణి అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. తల్లి మరణవార్త అందుకున్న వెంటనే విదేశాల్లో ఉన్న అజిత్ కుమార్ అత్యవసరంగా చెన్నైకి బయలుదేరినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.


# దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాచంకం

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# పులి-మేకతో రోజా రీఎంట్రీ


సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణేశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.




# 300 కోట్లు దాటిన కరుప్పు

తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. కరుప్పు చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.




# కరిష్మాకపూర్ తాజా వెబ్ సీరిస్ బ్రౌన్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే ప్రక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# మెగా డీఎస్సీలో ఏ చిన్న తప్పూ జరగలేదు

- నిజాలనే రిపోర్ట్ చేయండి.. అవాస్తవాలను నమ్మొద్దు
- డీఎస్సీ నిర్వహణపై అవాస్తవ కథనాలపై రిక్రూటైన టీచర్లు బాధపడొద్దు
- మెగా డీఎస్సీలో ఉద్యోగాలు వచ్చిన వారంతా కష్టపడి చదివిన వారే
- నిబంధనల ప్రకారమే స్పోర్ట్స్ కోటాలో నియామకాలు
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్ కేసులో కోర్టులు చెప్పినట్లే నడుచుకున్నాం
- హారిజాంటల్ రిజర్వేషన్ల విధానం కొందరికి అర్థం కాకపోవచ్చు
- జిల్లాల స్కోర్స్ ముందుగానే పబ్లిష్ చేశాం
- లీకేజి అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు
- ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలు నిర్వహించిన టీసీఎస్ ఐయాన్‌తో మెగా డీఎస్సీ
- ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు పెడతాం
- విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్



**అమరావతి, మే 30 :** మెగా డీఎస్సీ-2025 నిర్వహణలో ఎలాంటి పొరపాట్లూ.. తప్పిదాలు జరగలేదని విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. గతేడాది డీఎస్సీ ద్వారా రిక్రూటైన అభ్యర్థులు ఎవరూ బాధపడవద్దన్నారు. చాలా కష్టపడి చదివి డీఎస్సీ ద్వారా ఉద్యోగాలను పొందారని అన్నారు. డీఎస్సీ నిర్వహణపై జరుగుతోన్న దుష్ప్రచారాన్ని, అవాస్తవాలను నమ్మొద్దని కోరారు. గత కొంత కొన్ని రోజులుగా మెగా డీఎస్సీ-2025 నిర్వహణపై రాజకీయ దురుద్దేశంతో కొన్ని పార్టీలు, పత్రికలు చేస్తోన్న దుష్ప్రచారానికి విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం విద్యా భవన్ లో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్సులో స్పందించారు. ఇప్పటి వరకు ఏయే అంశాల్లో దుష్ప్రచారం జరుగుతుందో.. అ అంశాలపై సృష్టించిన అనుమానాలపై పూర్తి స్పష్టతనిచ్చారు. కొన్ని రోజులుగా డీఎస్సీ నిర్వహణపై చేస్తోన్న తప్పుడు ప్రచారంలో భాగంగా లేవనెత్తిన ప్రతీ ఆరోపణా తప్పేనంటూ ఆధారాలతో సహా ప్రెస్ మీట్ నిర్వహించారు. మెగా డీఎస్సీ 2025 నిర్వహణ ప్రక్రియను ఆసాంతం వివరిస్తూ మీడియా సమావేశంలో కోన శశిధర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కోన శశిధర్ మాట్లాడుతూ..."మెగా డీఎస్సీ-2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. అభ్యర్థులు కష్టపడి చదవి ఉద్యోగాలు పొందారు. 2018 తర్వాత మళ్లీ 2025లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. డీఎస్సీ నిర్వహణను సవాల్ చేస్తూ అడ్డుకునేందుకు 241 కేసులు వేశారు. వాటిని ఎదుర్కొని.. కోర్టుల్లో సరైన వాదనలు వినిపించి.. కోర్టు అనుమతులతో రికార్డు టైంలో 148 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశాం. పండుగ వాతావరణంలో రిక్రూట్మెంట్ లెటర్లు ఇచ్చాం. గతేడాది జరిగిన ఈ డీఎస్సీ నిర్వహణలో తప్పిదాలు జరిగాయంటూ ఇప్పుడు మళ్లీ ఆరోపణలు రావడం వస్తున్నాయి. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని ఘంటా పథంగా చెబుతున్నాను. అయితే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు కాబట్టి.. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మాపై ఉంది. మెగా డీఎస్సీ-2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. అభ్యర్థులు కష్టపడి చదవి ఉద్యోగాలు పొందారు. 2018 తర్వాత మళ్లీ 2025లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. డీఎస్సీ నిర్వహణకు టెట్ నోటిఫికేషన్ ఇవ్వడమనేది మాండేటరి కాబట్టి.... ఆ నోటిఫికేషన్ కూడా ఇచ్చాం. టెట్-డీఎస్సీ మధ్య సమన్వయం ఉంది కాబట్టే ఇంత చక్కగా నిర్వహించగలిగాం. నార్మలైజేషన్ ప్రక్రియను ఏ విధంగా చేస్తామోననే అంశాన్ని కూడా ముందుగానే వివరించాం. చిన్న పొరపాటు లేకుండా అత్యుత్తమంగా డీఎస్సీ నిర్వహించాం. టీచర్ ఉద్యోగాలు ఇచ్చాం. ఎస్సీ వర్గీకరణ, వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేశాం. ప్రతీ అంశాన్ని ఆన్ లైన్లో పొందుపరిచాం... వెబ్ సైట్లో పెట్టాం. గడిచిన డీఎస్సీల నిర్వహణ అనుభవంతో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం."అని కోన శశిధర్ చెప్పారు.

### ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలు నిర్వహించిన సంస్థతో డీఎస్సీ నిర్వహణ

"154 టీసీఎస్ ఐయాన్ సెంటర్లల్లో ఈ డీఎస్సీ పరీక్షను నిర్వహించాం. ఒకే సబ్జెక్టుకు వివిధ తేదీల్లో పరీక్షలు నిర్వహించాం.. కాబట్టి వేర్వేరు పేపర్లే ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు సుమారు 3 వేల క్వశ్చన్లతో క్వశ్చన్ బ్యాంకు రూపొందించాం. పర్మినెంట్ ఉద్యోగులైన ఇద్దరికి మాత్రమే క్వశ్చన్ బ్యాంకుకు యాక్సెస్ ఉంటుంది. ప్రతి రోజూ పాస్ వర్డ్స్ మారుతూ ఉంటాయి. ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, గేట్, ఎన్టీఏ, సీఏటీ, ఏపీపీఎస్సీ, హైకోర్ట్ పరీక్షలు వంటివి నిర్వహించిన టీసీఎస్ ఐయాన్‌కే ఈ బాధ్యతలు అప్పగించాం. ఇది మాన్యువల్ ఎగ్జామ్ కాదు.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో మెగా డీఎస్సీ నిర్వహించాం. అన్ని జిల్లాల స్కోర్స్ వెబ్ సైట్లల్లో పబ్లిష్ చేశాం... టెట్, డీఎస్సీ సోర్స్ కూడా వెబ్ సైట్లల్లో పబ్లిష్ చేశాం.. ఇప్పటికీ ఉన్నాయి. స్కోర్స్ ఇవ్వలేదని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. సర్టిఫికేట్ వెరిఫికేషన్‌లో భాగంగా ముందుగా ఆన్ లైన్లో అప్లోడ్ చేయాలని నిబంధన పెట్టాం.. అయితే వెరిఫికెషన్ కు వచ్చినప్పుడు సర్టిఫికెట్లు తెస్తామని రిక్వెస్ట్ చేయడంతో ప్రభుత్వం అంగీకరించింది. గతానుభవాల దృష్ట్యా వెయిటింగ్ లిస్టు కాకుండా.. 1:1 పద్ధతిలో పిలిచాం.. దీన్ని ఆనాడే అందరికీ చెప్పాం. వెరిఫికేషన్లో ఎవరైనా ఫెయిల్ అయితే ఆ తర్వాత వారిని వెరిఫికేషన్‌కు పిలిచాం. హారిజంటల్ రిజర్వేషన్లలో స్పోర్ట్స్, మహిళ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలు ఉంటాయి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకున్నాం కాబట్టే కోర్టులు డీఎస్సీ-2025 నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. ప్రస్తుతం పేపర్లల్లో వస్తోన్న కథనాలన్నీ హారిజాంటల్ రిజర్వేషన్లకు సంబంధించినవే. ప్రతి ఫిర్యాదును పరిశీలించాం....సమాధానాలిచ్చాం. ఎవరికైనా అనుమాలు ఉంటే.. వారికున్న అనుమానాలను నివృత్తి చేశాం. సంవత్సరం అయిన తర్వాత ఇప్పుడు ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉంది."అని విద్యా శాఖ కార్యదర్శి అన్నారు.

### నవీన్ ఎపిసోడ్‌లో కోర్టులు మా వాదననే బలపరిచాయి

"నవీన్ అనే అభ్యర్థి ఎస్సీఈఆర్టీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి. రెండు పరీక్షలు రాశారు.. ఓ దాంట్లో 1వ ర్యాంక్, రెండో దాంట్లో 6వ ర్యాంక్ వచ్చింది. అతను సెలెక్షన్ లిస్టులో ఉన్నారు.. కానీ వెరిఫికేషన్ కోసం రాలేదు. దీంతో నిబంధన ప్రకారం అతణ్ని రిక్రూట్మెంట్ చేయలేకపోయాం. ఆ తర్వాత నవీన్ కోర్టుకు వెళ్లాడు... కోర్టుల్లో మేమూ మా వాదనలు వినిపించాం. కోర్టు మా వాదనను బలపరిచింది. నవీన్ కేసులో కోర్టులు చెప్పినట్లే నడుచుకున్నాం. అతను వెరిఫికేషన్ ప్రక్రియకు ఎందుకు రాలేదో అతనికే తెలియాలి. లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తే ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు... తప్పు పట్టలేదు. హారిజంటల్ రిజర్వేషన్లను కొందరు అర్థం చేసుకోలేకపోయారు. ప్రస్తుతం పేపర్లల్లో వస్తున్న వార్తలు అవాస్తమని చెబుతున్నాను... ఆధారాలతో సహా వచ్చాను. స్పోర్ట్స్ కోటాలో కూడా ఎలాంటి తప్పులు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు దక్కించుకున్న వారు కూడా కష్టపడి ఉద్యోగాన్ని సాధించారు."అని శశిధర్ చెప్పారు.

### ప్రభుత్వ-ప్రైవేట్ బడుల మధ్య కాంపిటేషన్ ప్రారంభమైంది

"ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ-ప్రైవేట్ బడుల మధ్య కాంపిటేషన్ ప్రారంభమైంది. మా టీచర్లు పిల్లల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్నారు. డీఎస్సీ-2025లో సెలెక్ట్ అయిన ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి పైకి వచ్చిన వారే. డీఎస్సీ నిర్వహణపై అవాస్తవాలు చెప్పొద్దు... ఏమైనా చెప్పాలనుకుంటే నిజాలు చెప్పండి. జరుగుతున్న అవాస్తవ ప్రచారంతో కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు దక్కించుకున్న వారందరూ బాధపడతారు. టీచర్లెవ్వరూ బాధపడొద్దని కోరుతున్నాను. శాఖాపరంగా తప్పు ఏదైనా ఉంటే చెప్పండి.. నేర్చుకోవడానికి మేం సిద్దంగా ఉన్నాం. త్వరలో మరో డీఎస్సీని కూడా నిర్వహిస్తాం. దానికీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. తప్పుడు సమాచారాన్ని ప్రజలకు పంపొద్దు. నిజాలనే రిపోర్ట్ చేయండి.. దయచేసి అబద్దాలు మాత్రం చెప్పొద్దు. ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు పెట్టాం."అని విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ ఆధునీకరణకు కీలక నిర్ణయాలు

- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు విశాఖపట్నం నుంచి 40 ప్రత్యేక బస్సులు
- గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది...
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, మే 30 (మనసులోమాట ప్రత్యేక ప్రతినిధి) :** ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో బస్సుల ఆధునీకరణ, ఈవీ బస్సుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న స్త్రీ శక్తి పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుని కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో దశలవారీగా ఈవీ బస్సుల విస్తరణకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని, తొలి దశలో 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. జూలై నెలలో ఆరు డిపోలలో ఈవీ బస్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధం కానున్నాయని తెలిపారు. తిరుపతికి ప్రత్యేకంగా 300 ఈవీ బస్సులు కేటాయించగా, మరో 500 ఈవీ బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,000 ఈవీ బస్సుల ఏర్పాటుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని చెప్పారు. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 40 ప్రత్యేక బస్సులను కేటాయించనున్నట్లు తెలిపారు. అలాగే గోదావరి పుష్కరాల సందర్భంగా గోదావరి పేరున ప్రత్యేక బస్సు సర్వీసులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఆర్టీసీ అవినాభావ అనుబంధమని పేర్కొన్నారు. పీపీపీ విధానంలో డిపోల ఆధునీకరణ చేపడతామని, కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే నైట్ ఔట్ అలవెన్స్ సహా ఉద్యోగుల పలు సమస్యలను పరిష్కరించినట్లు మంత్రి గుర్తుచేశారు. త్వరలో అందుబాటులోకి రానున్న కొత్త ఈవీ బస్సులతో ఏపీఎస్ఆర్టీసీకి మరింత కొత్త రూపు సంతరించుకుంటుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.



# జూన్ నెల పెన్షన్లకు 2728 కోట్లు విడుదల

**అమరావతి, మే 30 :** రాష్ట్ర వ్యాప్తంగా జూన్ నెలలో 62,34,445 మంది పెన్షన్ దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు కూటమి ప్రభుత్వం రు. 2728.67 కోట్లు విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం తెలిపారు. కొత్తగా 5606 స్పౌజ్ ( భార్య / భర్త ) పెన్షన్లు మంజూరు కాగా... ఈ లబ్ధిదారులకు రు 2.24 కోట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసినట్టు మంత్రి తెలిపారు. ఈ నిధులు అన్నీ జూన్ 1వ తేదీ సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలతో కలుపుకుని ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రికార్డు స్థాయిలో రూ. 65,886.57 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అవ్వాతాతలు, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి కొండపల్లి తెలిపారు.



# ధవళేశ్వరం ఆయకట్టు రైతులకు శుభవార్త

### నేటి నుంచి నీటి విడుదలకు నిర్ణయం

### నీటిపారుదల సలహామండలి భేటీలో నిర్ణయం

### మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

**కాకినాడ, మే 30:** మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నందన నీటిని విడుదల చేస్తామని అన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. ఈ మేరకు నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ. 100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు.

# అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్‌పై దృష్టి

### హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాలు

### ఏపీసీఆర్డీఏ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

### ఏఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ

### 18 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపిన సీఆర్డీఏ అథారిటీ

**అమరావతి, మే 30 :** రాజధాని అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాల నగరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో మొత్తం 18 అంశాలకు ఆమోదం లభించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అర్బన్ మొబిలిటీ ప్లానింగ్, మౌలిక వసతుల విస్తరణ, ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి, ప్రత్యేక అగ్నిమాపక విభాగం ఏర్పాటు వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. హైకోర్టు భవనాలకు అనుబంధంగా రహదారులు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 547.07 కోట్ల వ్యయాన్ని అథారిటీ ఆమోదించింది. అలాగే రాజధానిలో పర్యాటక అభివృద్ధికి ఊతమిచ్చేలా పీపీపీ విధానంలో జెయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతి ప్రాంతంలో భవన నిర్మాణాలు, అక్రమ కట్టడాలకు సంబంధించిన వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని అథారిటీ నిర్ణయించింది. వివాదాలను కోర్టులకు వెళ్లకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు మీడియేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రాజధాని పరిధిలో అగ్నిమాపక అనుమతులు, భద్రతా ప్రమాణాల పర్యవేక్షణ కోసం సీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫైర్ వింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో భవిష్యత్ నిర్మాణాలకు వేగవంతమైన అనుమతులు, మెరుగైన భద్రతా వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఏలూరు నుంచి ప్రకాశం జిల్లా వరకు విస్తరించిన తొమ్మిది జిల్లాల పరిధిలో అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించేందుకు ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) సిద్ధం చేయాలని అథారిటీ ఆమోదించింది. పరిశ్రమలు, సేవారంగం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల విస్తరణకు అనుగుణంగా దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించనున్నారు. రాజధానిలో నిర్మించే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, నివాస భవనాలకు సెంట్రల్ డిస్ట్రిక్ట్ కూలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బల్క్ చిల్లింగ్ యూనిట్ల నుంచి పైపుల ద్వారా శీతలీకరణ అందించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. దీనివల్ల విద్యుత్ వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు లభిస్తుందని అధికారులు వివరించారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా దిగువ, మధ్యతరగతి వర్గాల కోసం అందుబాటు ధరల్లో గృహ సముదాయాలు నిర్మించాలని సీఎం ఆదేశించారు. ప్రతి టౌన్‌షిప్‌లో నివాసాలతో పాటు వర్క్ ఫ్రమ్ హోమ్, వాణిజ్య కార్యకలాపాలకు అనువైన సదుపాయాలు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎల్పీఎస్ లేఅవుట్లలో 495 మంది రైతుల అలాట్‌మెంట్ కోడ్లు మారిన కారణంగా తిరిగి రిజిస్ట్రేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో వారికి రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపునకు అథారిటీ ఆమోదం తెలిపింది. అలాగే అనువుకాని ప్లాట్లకు గ్రామకంఠంలో ఐదు సెంట్ల వరకు భూమి కేటాయించే ప్రతిపాదనకు కూడా అంగీకారం లభించింది. అమరావతి కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రబిందువుగా ఎదగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో రోగులతో వచ్చే అటెండెంట్లకు కూడా వసతి కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాజధానిని "బ్లూ-గ్రీన్ సిటీ"గా తీర్చిదిద్దే లక్ష్యంతో సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## భారీగా తగ్గిన బంగారం

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా బంగారం కొనుగోళ్లలో మందగమనం కనిపిస్తున్న నేపథ్యంలో పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. బంగారానికి డిమాండ్ గణనీయంగా తగ్గడంతో పాటు విక్రయాలు కూడా భారీగా పడిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రభావంతో శనివారం బంగారం ధరల్లో గణనీయమైన తగ్గుదల నమోదైంది. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,640గా ఉండగా, శనివారం అది రూ.600 తగ్గి రూ.1,57,040కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.550 తగ్గి రూ.1,43,950గా నమోదైంది. 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.450 తగ్గి రూ.1,17,780 వద్ద కొనసాగుతోంది. ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో రూ.1,57,040గా ఉంది. ఢిల్లీలో రూ.1,57,190గా ఉండగా, చెన్నై, మధురై, కోయంబత్తూరులో రూ.1,59,600గా నమోదైంది. బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ అంతర్జాతీయ పరిస్థితులు, పెట్టుబడి ధోరణులు, డిమాండ్ ఆధారంగా ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి పరిశీలించాలని సూచిస్తున్నారు.

## ముంబైలో మళ్లీ గ్యాస్ ధరల షాక్




**ముంబై:** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో సామాన్యులపై ఇంధన భారం మరింత పెరిగింది. ముంబయి, పరిసర ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరను కిలోగ్రాముకు రూ.2 మేర పెంచినట్లు గ్యాస్ పంపిణీ సంస్థ ప్రకటించింది. కేవలం 16 రోజుల వ్యవధిలో ధరలు పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. వాహనాల కోసం వినియోగించే గ్యాస్‌తో పాటు గృహ అవసరాలకు పైప్‌ల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు ధరలను కూడా పెంచినట్లు సంస్థ వెల్లడించింది. తాజా సవరణతో ముంబయిలో గ్యాస్ ధర కిలోగ్రాముకు రూ.86కు చేరింది. గృహ వినియోగ గ్యాస్ ధర కూడా స్వల్పంగా పెరిగింది. ఈ తాజా పెంపుతో మే నెల మధ్య నుంచి ఇప్పటివరకు గ్యాస్ ధరలు మొత్తం రూ.4 మేర పెరిగినట్లయింది. దీంతో వాహనదారులు, గృహ వినియోగదారులపై అదనపు భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే దేశీయ గ్యాస్ కేటాయింపులు తగ్గడం, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు గ్యాస్ కొనుగోలు చేయాల్సి రావడం, అంతర్జాతీయంగా రూపాయి విలువ క్షీణించడం వంటి కారణాల వల్ల వ్యయం పెరిగిందని సంస్థ తెలిపింది. మరోవైపు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పలు నగరాల్లో గ్యాస్ పంపిణీ సంస్థలు ఇప్పటికే ధరలను పెంచగా, మరికొన్ని సంస్థలు కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో వాహనదారులు, గృహిణుల నెలవారీ ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గోల్డ్ బాండ్‌లకు భారీ లాభం

ముంబై : సావరిన్ గోల్డ్ బాండ్ పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి భారతీయ రిజర్వు బ్యాంకు శుభవార్త అందించింది. 2021-22 రెండో విడత కింద జారీ చేసిన గోల్డ్ బాండ్లకు ముందస్తు విమోచన ధరను ప్రకటిస్తూ యూనిట్‌కు రూ.15,672గా నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం ఈ బాండ్లు జారీ చేసిన సమయంలో ఒక్క గ్రాము ధర రూ.4,792గా ఉండగా, ప్రస్తుతం ప్రకటించిన ధరతో పోలిస్తే పెట్టుబడిదారులకు 227 శాతానికి పైగా రాబడి లభించినట్లైంది. దీంతో అప్పట్లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు సుమారు రూ.3.27 లక్షల విలువ లభించే అవకాశం ఏర్పడింది. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం గోల్డ్ బాండ్ల పూర్తి కాలపరిమితి ఎనిమిది సంవత్సరాలు అయినప్పటికీ, ఐదేళ్లు పూర్తయిన తర్వాత వడ్డీ చెల్లింపు తేదీల్లో ముందస్తు విమోచన సదుపాయం కల్పిస్తారు. ఈ బాండ్లు 2021 జూన్ 1న జారీ కావడంతో ఈ ఏడాది జూన్ 1 నుంచి వాటిని నగదుగా మార్చుకునే అవకాశం కల్పించారు. ముందస్తు విమోచన ధరను నిర్ణయించేందుకు బంగారం మార్కెట్ ధరలను ఆధారంగా తీసుకుంటారు. విమోచన తేదీకి ముందు మూడు పని దినాల్లో నమోదైన స్వచ్ఛమైన బంగారం ముగింపు ధరల సగటు ఆధారంగా ఈ ధరను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో గోల్డ్ బాండ్ పెట్టుబడిదారులకు గణనీయమైన లాభం చేకూరనుంది. బంగారం ధరలు భారీగా పెరగడంతో ఈ పథకం ద్వారా పెట్టుబడి పెట్టిన వారు మంచి రాబడిని పొందుతున్నారని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. సురక్షిత పెట్టుబడితో పాటు బంగారం ధరల పెరుగుదల ప్రయోజనాన్ని అందించే ఈ పథకం మరోసారి పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# జూన్ నుంచి మారనున్న కీలక ఆర్థిక నిబంధనలు

**న్యూఢిల్లీ :** మే నెల ముగిసి జూన్ నెల ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు కీలక ఆర్థిక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. వంటగ్యాస్ ధరల సవరణ నుంచి క్రెడిట్ కార్డుల ఛార్జీలు, మ్యూచువల్ ఫండ్ల నిబంధనలు, ఆధార్ అప్‌డేట్ గడువు వరకు అనేక మార్పులు సామాన్యులపై ప్రభావం చూపనున్నాయి. ప్రతి నెల మాదిరిగానే జూన్ 1న వంటగ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు సమీక్షించనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, ముడి చమురు ధరలను బట్టి గృహ, వాణిజ్య సిలిండర్ల ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు విధానాలకు అనుగుణంగా పలు బ్యాంకులు స్థిర నిక్షేపాలు, రుణాలపై వడ్డీ రేట్లను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్తగా రుణాలు తీసుకునే వారు, ఇప్పటికే నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్న వారిపై ఈ మార్పుల ప్రభావం ఉండొచ్చు. జూన్ నుంచి పలు బ్యాంకులు తమ క్రెడిట్ కార్డు నిబంధనల్లో కూడా మార్పులు తీసుకురానున్నాయి. రివార్డు పాయింట్ల పరిమితి, వినియోగ సేవల బిల్లులపై అదనపు రుసుములు, విమానాశ్రయ విశ్రాంతి కేంద్రాల సదుపాయాల విషయంలో మార్పులు ఉండనున్నట్లు సమాచారం. అందువల్ల వినియోగదారులు తమ బ్యాంకుల తాజా నిబంధనలను పరిశీలించాలని సూచిస్తున్నారు. అత్యంత ముఖ్యంగా ఆధార్ వివరాల ఉచిత సవరణకు సంబంధించిన గడువు జూన్ 14తో ముగియనుంది. పేరు, చిరునామా, పుట్టిన తేదీ వంటి వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా సవరించుకునే అవకాశం అప్పటి వరకు మాత్రమే ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత రుసుము చెల్లించాల్సి రావచ్చు. మరోవైపు మ్యూచువల్ ఫండ్ లావాదేవీలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు కొత్త నిబంధనలు దశలవారీగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు పెట్టుబడిదారులకు మరింత భద్రత, సౌలభ్యం కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. జూన్ నెలలో అమల్లోకి రానున్న ఈ మార్పులు సామాన్యుల ఆర్థిక ప్రణాళికలపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్న నేపథ్యంలో ప్రజలు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.




# స్పైస్‌జెట్‌కు రూ.124 కోట్ల పన్ను నోటీసు




**న్యూఢిల్లీ :** ప్రముఖ తక్కువ ఖర్చు విమానయాన సంస్థ స్పైస్‌జెట్ మరోసారి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. జీఎస్టీ రిటర్నులు వరుసగా దాఖలు చేయకపోవడంతో వస్తు సేవల పన్ను శాఖ సంస్థకు రూ.124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేకాకుండా సంస్థ జీఎస్టీ నమోదు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం నిర్దేశిత గడువులో రిటర్నులు సమర్పించకపోవడంతో సంబంధిత నిబంధనల ప్రకారం తాత్కాలిక అంచనా ప్రక్రియ చేపట్టి బకాయిలను ఖరారు చేశారు. వివిధ నెలలకు సంబంధించిన పన్ను బకాయిలను కలిపి మొత్తం రూ.124.65 కోట్ల డిమాండ్‌ను నిర్ణయించినట్లు తెలుస్తోంది. జీఎస్టీ నమోదు రద్దుకు సంబంధించి ఇప్పటికే నోటీసు జారీ చేసినప్పటికీ సంస్థ నుంచి ఇంకా పూర్తి స్థాయి సమాధానం అందలేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న రిటర్నులను వెంటనే దాఖలు చేసి నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్పైస్‌జెట్ ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. గత త్రైమాసికంలో కూడా సంస్థ భారీ నష్టాలను నమోదు చేసినట్లు వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావం సంస్థ షేర్లపై కూడా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పన్ను శాఖ తాజా చర్యలతో స్పైస్‌జెట్ భవిష్యత్ కార్యాచరణపై విమానయాన రంగంలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం సంస్థ ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందనేది కీలకంగా మారింది.

# జూన్‌లో బ్యాంకులకు వరుస సెలవులు

### ముందుగానే ప్లాన్ చేసుకోండి..!

**హైదరాబాద్ :** జూన్ నెలలో బ్యాంకు ఖాతాదారులు తమ ఆర్థిక లావాదేవీలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు విడుదల చేసిన సెలవుల జాబితా ప్రకారం వారాంతపు సెలవులతో పాటు పలు ప్రాంతీయ పండుగల సందర్భంగా బ్యాంకులు మూసివేయబడనున్నాయి. జూన్ 15న వైఎంఏ డే సందర్భంగా మిజోరాంలో, రాజా సంక్రాంతి పండుగ కారణంగా ఒడిశాలో బ్యాంకులు పనిచేయవు. జూన్ 25న మొహర్రం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. జూన్ 26న మొహర్రం సందర్భంగా తెలంగాణ, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో బ్యాంకు సేవలు నిలిచిపోతాయి. జూన్ 29న సంత్ గురు కబీర్ జయంతి కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి. జూన్ 30న రెమ్నా ని పండుగ సందర్భంగా మిజోరాంలో ప్రాంతీయ సెలవు అమలులో ఉంటుంది. ఇవే కాకుండా దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం అయిన జూన్ 7, 14, 21, 28 తేదీల్లో బ్యాంకులు పనిచేయవు. అలాగే రెండో శనివారం జూన్ 13, నాలుగో శనివారం జూన్ 27న కూడా బ్యాంకు శాఖలు మూసి ఉంటాయి. అయితే బ్యాంకు శాఖలకు సెలవులు ఉన్నప్పటికీ ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎంలు, యూపీఐ సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయి. గూగుల్ పే, ఫోన్‌పే, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను వినియోగదారులు ఎలాంటి అంతరాయం లేకుండా ఉపయోగించుకోవచ్చు. నగదు డిపాజిట్లు, చెక్కుల క్లియరెన్స్, డిమాండ్ డ్రాఫ్టులు లేదా ఇతర శాఖాపరమైన పనులు ఉన్నవారు సెలవుల జాబితాను ముందుగానే పరిశీలించి తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు.




# విక్రయాల కోసం భారీ తగ్గింపు

### టెస్లా మోడల్ వై ధరలో రూ.9 లక్షల కోత..!

**హైదరాబాద్ :** ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ వాహన తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో తన మోడల్ వై కారుపై భారీ ధర తగ్గింపును ప్రకటించింది. దేశీయ మార్కెట్లో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో కంపెనీ ఏకంగా రూ.9 లక్షల మేర ధరను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం భారత విద్యుత్ వాహన రంగంలో చర్చనీయాంశంగా మారింది. భారీ ధరల కారణంగా వినియోగదారులు ఇతర కంపెనీల విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో టెస్లా తన వ్యూహాన్ని మార్చుకుంది. కొత్త ధరలతో మోడల్ వై వాహనం మరింత మందికి అందుబాటులోకి రానుంది. అలాగే భారత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వాహనాల శ్రేణిలో కూడా మార్పులు చేస్తూ కొత్త వేరియంట్లను ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది. ధరల తగ్గింపు వల్ల విద్యుత్ వాహనాల విభాగంలో పోటీ మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేశీయ సంస్థలు, ఇతర అంతర్జాతీయ బ్రాండ్లపై ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశముంది. పెరుగుతున్న పోటీ కారణంగా వినియోగదారులకు మరిన్ని ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతున్న తరుణంలో టెస్లా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. తక్కువ ధరలకు అత్యాధునిక సాంకేతికత కలిగిన వాహనాలను అందించడం ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవడమే కంపెనీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సమాచారం. ఈ భారీ ధర తగ్గింపు తర్వాత టెస్లా విక్రయాలు ఎంత మేర పెరుగుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

